
24/5 Mile Stone

# హాస్యానందం

సంపూర్ణ హాస్య మాసపత్రిక  జులై-2026  ₹25






నీ చిరునవ్వే చిరునామా కావాలి!

'ఆమె' కథలు





**Sambamurty Enterprises**
12-10-04, Convent Street, Vijayawada-520 001. fone: 9676444548

తెలుగులో వెలువడుతున్న
ఏకైక హాస్య మాస పత్రిక

# హాస్యానందం




| జులై-2026 | 24 వ సంవత్సరం ✦ 5 వ సంచిక | ముఖచిత్రం: నవ్వే అందం!<br>కార్టూన్: బాచి |
|---|---|---|

సంవత్సర చందా-రూ.300/- | 2 సంవత్సరాల చందా-రూ.600/- | జీవిత చందా- రూ.5000/-

**Publisher& Editor-Ramu.P**

Editorial Office: **HASYANANDAM**
# 8-215/4, Near Ramalayam, **YERRABALEM-522 503**
Mangalagiri Mandal, Guntur dist. *Ph* : **9849630637**
email: **hasyanandam.mag@gmail.com**
web: **www. hasyanandam.com**

*FullPillar* : Bnim

*Cartoon Feature Editor*: Bachi

*Creative Team*
Dr. K.Ramakrishna, Sarasi,
Dayakar, Krishna, Nagisetty,
Sangram, GopalKrishna,
Bomman, Gandhi,Venkat,
Kandlakunta SarathChandra
Vadlamannati Gangadhar.

*D.T.P:*
P. Ramalakshmi, 9440304993

*Digital Media Director:*
Surya

*Well Wishers:*
Dr.K.V.Ramanachary, (*I.A.S.Retd*)
Tanikella Bharani
K.V.V.Satyanarayana
Akshagna Vidya Venkat
Dr.V.V.Rama Kumar
Dr.Surepalli Vijaya

*Prize Sponsers*
K.V.V.Satyanarayana
Akshagna Publications
K.Sundaresayya & Satyavathi
*Cartonist* Ramsheshu
Md.Raj Mohammed
Nimmi Madhubala
A.V. Krishna Murthy

**Hyderabad & Secunderabad Distributor:**
M.Panduranga,
**Risingsun News Agency**
Abids, Hyderabad -01
**Ph: 9666680857, 6301072906.**




## ఈ సంచికలో నవ్వుల చిరునామాలు...



### ఈ సంచికలో మన 'రచయిత్రులు' రాసిన కథలు- 'ఆమె కథలు!'


| | | |
|---|---|---|
| 18 | క్లియరెన్స్ సేల్ | -వేలూరి ప్రమీలా శర్మ |
| 22 | కేసు ముగిసింది | -పి.ఎల్.ఎన్.మంగారత్నం |
| 31 | చౌక బేరం | -తెలికిచెర్ల విజయలక్ష్మి |
| 32 | బో(ద్రో) చేవారెవరురా! | -డా.చివుకుల పద్మజ |
| 36 | సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు | -సింహాద్రి నాగ శిరీష |
| 38 | చెల్లి మల్లి...లొల్లి! | -మన్నవ నాగలలితశ్రీదేవి |
| 44 | అద్దె ఇల్లు | -సి.యమున |
| 48 | పాపం! ఈ దొంగ మంచివాడే! | - కె.వి.సుమలత |


### శీర్షికలు


| | | |
|---|---|---|
| 8 | ఈనెల ప్రోత్సాహక బహుమతులు | |
| 28 | నవ్వులాట | -గాంధీ మనోహర్ |
| 26 | స్మైల్ స్టార్స్ | -అరుణ్ |
| 34 | ఇండియన్ ఇంక్ | - మనోజ్ చోప్రా |
| 20 | వెనక్కి వెళ్ళే కథలు | -గంగాధర్ వడ్లమన్నాటి |
| 50 | పదానందం | -పోపూరి విశ్వనాథ్ |



### సీరియల్స్



| | | |
|---|---|---|
| 14 | కొంగుచాటు కృష్ణుడు | -యండమూరి వీరేంద్రనాథ్, యర్రంశెట్టి శాయి |
| 40 | సినిమా తీద్దామా? | -గొలుసు సీరియల్ |


### స్పెషల్స్


| | | |
|---|---|---|
| 12 | నీ చిరునవ్వే నీ చిరునవ్వు కావాలి | -ఎ.దయాకర్ |
| 25 | 'మనమీదేనగ్రోయ్' | -సరసి |
| 45 | ఉచిత సలహాలు | -శర్మ, శేషి, వశ్రీ |





### ఈ సంచికలో కార్టూనిస్ట్‌లు

- సరసి
- బాచి
- శేఖర్
- బీవీఎస్
- బొమ్మన్
- గోపాలకృష్ణ
- కృష్ణ
- శాయికృష్ణ
- సుజయ్‌కృష్ణ
- నాగిశెట్టి
- భగవాన్
- లేపాక్షి
- గాంధీ
- ప్రసిద్ధ
- అరుణ్
- మోహన్ కుమార్
- రామ్‌శేషు
- పుష్ప
- శర్మ
- సుజయ్‌కృష్ణ
- పి.పి.నాయుడు
- హరి
- చక్రవర్తి
- పద్మ
- భాను
- ప్రసాద్ కాజ
- వందన శ్రీనివాస్
- తోపల్లి ఆనంద్
- దామెర్ల మూర్తి
- అర్జున్
- వర్చస్వీ
- శ్రీనివాస్
- డి.వి.ప్రసాద్
- సునీల్
- షేక్ సుభాని
- అప్పాజికృష్ణ
- శ్రీధర్
- ఎమ్.రాము
- రియాజ్
- జగన్నాథ్
- సురేష్



### కార్టూన్ శీర్షికలు


| | | |
|---|---|---|
| బడాయి బాబులు | -బొమ్మన్ | -10 |
| నవ్వుకొమ్మచ్చి | -సరసి | -16 |
| మిక్చర్ పొట్లం | -రామ్‌శేషు | -19 |
| చిలుక జో(హా)స్యం | -శాయికృష్ణ | -21 |
| పంచ్ ఫ్రేమ్ | -కృష్ణ | -30 |
| ప్రొఫెషనల్ ఫన్ | -నాగిశెట్టి | -49 |
| నవ్వే మందు | -ప్రసిద్ధ | -32 |
| హే భగవాన్ | -భగవాన్ | -42 |
| బుడ్డోడు | -సుజయ్‌కృష్ణ | -43 |
| నెల నెల నవ్వుల వెన్నెల | | -46 |




గమనిక:
ఈ పత్రికలో ప్రచురింపబడే వ్యంగ్య, హాస్య రచనలు, కార్టూన్లు కేవలం హాస్యం కోసం ప్రచురించినవి మాత్రమే. ఏ వ్యక్తిని గాని, సంస్థని గాని కించపరచాలన్నది అభిమతం కాదు. ఇందులో ప్రచురించిన రచనలన్నీ ఆయా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే.

# హాయ్...సానందంగా...

**హాస్యానందం అభిమానులకు... ఆప్తులకు... హాస్యప్రియులకు...**
**సన్నిహితులకు హాస్యాభివందనాలు!**

**ఇ**ద్దరు మనుషులను, రెండు కుటుంబాలను ఒకటిగా చేసే సంప్రదాయం పెళ్ళి! మన దేశంలో మాత్రమే ఘనత వహించిన ఈ వేడుక 'ఈ' రోజుల్లో కొంతమంది వారి వారి స్వార్ధం కోసం చేసే పనుల వలన మసకబారిపోతోంది. 'విదేశాల్లో' వివాహం అంటే ఇద్దరు వ్యక్తుల నిర్ణయం కాగా... భారతదేశంలో ఇది కుటుంబాల మధ్య జరిగే పండుగ. దీనివల్ల సమాజంలో ఒక బలమైన కుటుంబ వ్యవస్థ నిర్మించబడుతుందని నమ్ముతారు మనవాళ్ళు. పెద్దల ఆశీర్వాదం మరియు బంధుమిత్రుల కలయిక ఈ వేడుకకు ప్రత్యేకమైన ఆనందాన్ని ఇస్తుంది. అయితే ప్రపంచం చాలా చిన్నదిగా మారిపోయిన ఈ (?)కాలంలో మనవాళ్ళ స్వభావాలు కూడా కుచించుకు పోయి... ఒక పరిధి ఏర్పరచుకుని ఆవేశపూరిత నిర్ణయాలు తీసుకోవటం ఇప్పటి ట్రెండ్ అయి కూర్చుంది. జీవితాంతం ఒకరినొకరు తోడుగా ఉండాలని, సంపద, సంతోషం, సంతానం, ఆరోగ్యం, అనుకూలత కోసం దేవుడిని కోరుకుంటూ... 'పచ్చని ఆకులతో' కళకళలాడే పెళ్ళి పందిళ్ళ నడుమ జరిగే ఈ ఆచారం... 'అనుకూలత' కోసం ప్రస్తుతం 'విడాకులు' పేరుతో కోర్టుల చుట్టూ ప్రదక్షిణం చేయటం శోచనీయం! 'నా జీవితం...నా ఇష్టం' అనుకునే 'వీళ్ళు' ఆడంబరానికి ఇచ్చే ప్రాధాన్యత, ఆచారంగా జరిపే విధానం పై శ్రద్ధ చూపక... ఈ ఆచారం వెనుక ఉండే అర్ధం చాలా మందికి అర్ధం కాక...చేసుకోక మన ఈ గొప్ప సంప్రదాయాన్ని నవ్వులపాలు చేస్తున్నారు. 'తెర' అడ్డం పెట్టుకుని జరుపుకునే ఈ 'ఆహ్లాదాన్ని' అహం అనే 'తెరలు' అడ్డం పెట్టుకుని 'నేనంటే నేను' అనుకుంటూ కోర్టు మెట్లెక్కడం నిజంగా బాధాకరమైన విషయం! మరీ బాధాకరమైన విషయం ఏమిటంటే ప్రేమించి పెళ్ళి చేసుకున్న వాళ్ళు కూడా ఇలా మారటం! ప్రేమించడానికి, ప్రేమని పొందడానికి పడ్డ కష్టం... దాన్ని చివరిదాకా కాపాడుకోవడానికి ప్రయత్నం చేయట్లేదు! ముఖ్యంగా 'ఈ'తరం యువతరంలో అహం ఒక అడ్డుగోడైతే... 'లెక్కలు' మరో కనిపించని భూతం అయి కూర్చొంది. సుఖశాంతులు 'డబ్బుతోనే'...అనే భ్రమలో ప్రశాంతమైన  జీవితాన్ని కోల్పోయి... వాళ్ళు అనుభవించేదే జీవితం అనుకుంటూ మరీచికతో సహజీవనం చేస్తున్నారు. డబ్బు ఎంత 'సంపాదించాము' అని కాకుండా...'సుఖశాంతులు' ఎంత సంపాదించాం అనేది లెక్క వేయమంటే చాలామంది తెల్లమొహం వేయటం ఖాయం! అందమైనదే కాదు... విలువైన ఈ ఆచారాన్ని మనకిష్టమైనట్లు మార్చేయకుండా... మన ముందు తరాలకి ఒక మంచి సంప్రదాయాన్ని కొనసాగింపుగా ప్రయత్నం చేద్దాం! అందరూ ఆనందంగా... ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటూ...




గత పది సంవత్సరాలుగా తెలుగు కార్టూనిస్టుల దినోత్సవానికి చేయూతనందిస్తున్న ప్రముఖ పారిశ్రామికవేత్త **శ్రీ రాజేష్ అగర్వాల్ గారు** మే,20,2026న అనివార్య కారణాల వలన సభకు హాజరు కాలేక పోయారు. జూన్15 న హాస్యానందం ఎడిటర్ శ్రీ రాము, కృతజ్ఞతా పూర్వకంగా శ్రీ రాజేష్ అగర్వాల్ గారిని ఆయన స్వగృహంలో కలిసి సత్కరించారు.





## రీ సౌండ్



✦ **శ్రీలేఖ పి.ఎస్., సికింద్రాబాద్**


స్టార్ రచయిత 'యండమూరి వీరేంద్ర నాథ్' గారి ఒక్క పేజీ 'చిన్న' కథ చూడటం, చదవటం, మా జీవితంలో మొదటిసారి. 'మేధావుల కంపెనీలో వాదన వ్యాసనం'లో సోషల్ మీడియా 'డాబుల' గురించి చక్కగా వర్ణించారు (ఒక్క వాక్యం నీతిలో). 'వెనక్కి వెళ్ళేకథలు' గంగాధర్ గారి 'ఇల్లు అమ్మను'కథలో ఆఖరి వాక్యం ట్విస్ట్ ఇచ్చింది. పాత ఇంటి-ఊరి జ్ఞాపకాలు-మధుర స్మృతులు ఓ పట్టాన పోవు అంటారు, నిజమే! అలాగే కమీషన్ ఏజెంట్ స్మృతులు కూడా!


✦ **ఆర్.కృష్ణారావు, బెంగళూరు**

**జూన్** సంచికలో 'ముళ్ళపూడి' హాస్య కథల పోటీలో బహుమతి పొందిన కథలు దేనికవే గొప్పగా ఉన్నాయి. ముఖ్యంగా మా అభిమాన రచయిత యండమూరిగారు పోటీకి కథ పంపడం అద్భుతం! జడ్జిమెంట్‌కి పేర్లు లేకుండా పంపిన వాటిలో ఆయన కథ సెలక్ట్ కావటం ఆ కథ గొప్పతనం అది. ఇలాంటి కథలు చేయి తిరిగిన రచయితలు తప్ప రాయలేరనేది వాస్తవం! చెప్పదల్చుకున్న విషయం ఒక చిన్న ఇతివృత్తంతో అనుసంధానం చేసిన విధానం గ్రేట్! యువ రచయితలు నేర్చుకోవలసిన విధానం ఇది!

✦ **జి.విశాలాక్షి, హైదరాబాద్.**


**జూన్** హాస్యానందం చాలా బాగుంది. 'హాయ్ సానందంగా'లో ఎడిటర్‌గారు చెప్పినట్లు ఆర్భాటాలు చూపించడానికి కాకుండా... అవసరమయిన కానుకలు ఇవ్వటం వలన ఉపయోగపడుతుందన్నది వాస్తవం! ఈ సంచికలో ప్రచురించిన బహుమతి పొందిన కథలు చాలా బాగున్నాయి. మీరన్నట్లు బొమ్మలు అదనపు ఆకర్షణ... మీ కృషికి అభినందనలు!



# హాస్యానందం అభిమాన చందాదారులకు గమనిక

గత 24 సంవత్సరాలుగా హాస్యానందాన్ని అభిమానిస్తున్న మా ప్రియమైన చందాదారుల సౌలభ్యం కోసం కొన్ని మార్గదర్శకాలు రూపొందించడం జరిగింది. అవి...




- ప్రతినెలా 10 వతేదీ లోగా మీకు పత్రిక అందక పోతే... మీ కవరుపైనున్న మీ **చందా నెంబరు** తప్పనిసరిగా రాసి **95026 30637** నెంబరకు వాట్సాప్ మెసేజ్ మాత్రమే పంపండి!
- 15వ తేదీన మీ కాపీ మరల పోస్ట్ చేయడం జరుగుతుంది.



**వివరాల కోసం ఫోన్ చేయాల్సిన సమయం- పనిదినాలలో ఉ॥10 నుండి 12 వరకు; మ॥ 3 నుండి 5 వరకు**

## నవ్వుల నావి(య)కులకు మనవి

తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్య మాస పత్రిక హాస్యానందం నవ్వుల నదిలో తమ కథలు, కారూన్లతో మన పాఠకులను విహరింపజేస్తున్న మా నావి(య)కులకు అభినందనలు తెలుపుతూ... రచయితలు,రచయిత్రులు, కార్టూనిస్టులు తప్పనిసరిగా తమ రచనలు, కార్టూన్లు **hasyanandam.mag@gmail.com** ఈ మెయిల్ కే పంపవలసినదిగా కోరుతున్నాం! కథల ప్రచురణకు మూడు నెలల వ్యవధి పడుతుంది. కార్టూన్లు ఏనెలకానెల ప్రచురిస్తాం కాబట్టి ప్రతి నెలా 15వ తేదీ లోగా పంపవలసినదిగా మనవి!

**దయచేసి వాట్సాప్‌లో కథలు, కార్టూన్లు పంపవద్దు!**




## ఈ నెల ప్రోత్సాహక బహుమతులు

మన కార్టూనిస్ట్‌లను ప్రోత్సాహించాలనే సదుద్దేశంతో **ప్రతి నెలా** హాస్యానందంకు వచ్చిన కార్టూన్‌లలోంచి కొన్ని మంచి కార్టూన్లకు **ఇచ్చే ప్రోత్సాహక బహుమతులు.**

నెలనెలా... ప్రతినెలా
**4500 రూపాయల బహుమతులు**





'కార్టూన్ మిత్ర'
**శ్రీ కె.వి.వి.సత్యనారాయణగారు**
**ఈ కార్టూన్‌కి రూ.1000/-లు**
బహుమతిగా ఇస్తున్నారు.







**శ్రీమతి నమ్మి మధుబాల**
**(బాపు రమణల లోగిలి-ఫేస్బుక్ గ్రూప్)**
కార్టూన్ కళ పై ఆరాధనతో...
ఈ మూడు కార్టూన్లకు ప్రోత్సాహక బహుమతిగా
**1000 రూపాయలు ఇస్తున్నారు.**












**అక్షజ్ఞ పబ్లికేషన్స్ వారు**
**ఒకో కార్టూన్‌కి రూ.500/-లు చొప్పున**
**ఈ రెండు కార్టూన్లకు**
**1000 రూపాయలు**
బహుమతి ఇస్తున్నారు.

శ్రీ కుప్పచ్చి సుందరేశయ్య,
శ్రీమతి సత్యవతి వార్లు
ఈ కార్టూన్‌కి
**500 రూపాయలు**
బహుమతిగా
ఇస్తున్నారు.











కార్టూనిస్ట్
**ఎమ్.డి. రాజ్ మహమ్మద్ గారు**
ఈ కార్టూన్‌కి
**500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.





ప్రముఖ కార్టూనిస్ట్
మోపూరు రామ్‌శేషు,
తమ కుమార్తె
**మోపూరు పావని**
జ్ఞాపకార్థం
ఈ కార్టూన్‌కి
రూ. 500/-లు
బహుమతిగా
ఇస్తున్నారు








రాత, గీత
BOMMAN

మన చుట్టు పక్కల సాదా సీదా జనాలతో పాటూ... మందు బాబులు, విందు బాబులతో పాటు... బడా బాబులు, బడాయి బాబులూ ఉంటారు... వీళ్లలో ఈ **బడాయి బాబుల బడాయే** మన కథకి మూలం!






# శ్రీమతి అన్నం భాగ్యవతి స్మారక పురస్కారం

ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీబాచిగారు, తమ తల్లిగారు శ్రీమతి అన్నం భాగ్యవతి (బాచి) గారి స్మారకార్థం ఈ కార్టూన్ పోటీ నిర్వహిస్తున్నారు.

| | |
|---|---|
| మొదటి బహుమతి | రూ.5000/-లు, మెమెంటో+సర్టిఫికేట్ |
| రెండవ బహుమతి | రూ.3000/-లు, మెమెంటో+సర్టిఫికేట్ |
| మూడవ బహుమతి | రూ.2000/-లు, మెమెంటో+సర్టిఫికేట్ |
| జ్యూరీ బహుమతులు | రూ.500/-లు చొప్పున 10 బహుమతులు |




హాస్యాభిమాని, కార్టూనిస్టులు **శ్రీఎస్.వి.రమణ గారు** తమ తల్లిదండ్రులు **శ్రీసోమయాజుల శివరామయ్య, శ్రీమతి హైమవతి గార్ల స్మారకార్థం** ఈ కార్టూన్ పోటీ నిర్వహిస్తున్నారు.

ఒక్కో కార్టూన్ కి 1000 రూపాయలు చొప్పున 10 బహుమతులు

ఒక ప్రముఖ కార్టూనిస్ట్‌కి సన్మానం

ఆగష్టు 23న విజయవాడలో బహుమతి ప్రదానోత్సవం నిర్వహించబడుతుంది.

ఈ మెయిల్‌కి కార్టూన్లు పంపవలెను-
**sreedhar.annam@yahoo.in**

కార్టూన్లు చేరవలసిన ఆఖరు తేదీ : 20.7.2026

హాస్యానందం సౌజన్యంతో నిర్వహిస్తున్న కార్టూన్ పోటీలు

# పాలపర్తి రాజగోపాల్,ఉమాదేవి స్మారక

## దసరా కార్టూన్ పోటీ!





## మాటల్లేవ్!... మాట్లాడటాల్లేవ్!

(క్యాప్షన్‌లెస్ కార్టూన్ పోటీ)

'జ్యోతిష విశారద' శ్రీ పాలపర్తి శ్రీకాంత్ శర్మ, వారి తల్లి దండ్రుల స్మారకార్థం ఈ పోటీని నిర్వహిస్తున్నారు.

₹10 వేలు

ఒక్కో కార్టూన్‌కి 1000 రూపాయలు చొప్పున 10 బహుమతులు

ఈ **క్యాప్షన్‌లెస్** కార్టూన్ పోటీలో కార్టూన్లు సులభంగా అర్థమయి నవ్వొచ్చే వాటికే మొదటి ప్రాధాన్యత! మరో ముఖ్య నిబంధన ఎలాంటి అక్షరాలు కార్టూన్లో కనబడకూడదు... మీ సంతకం తప్ప!

కార్టూన్లు చేరవలసిన ఆఖరు తేదీ: సెప్టెంబర్-05, 2025

ఈ మెయిల్‌కి కార్టూన్లు పంపవలెను-
**hasyanandampoteelu@gmail.com**

# నీ చిరునవ్వే నీ చిరునామా కావాలి!



-ఏ.దయాకర్
Cartoonist & Animator

**నేటి ఆధునిక జీవితంలో ఒత్తిడి సాధారణం అయ్యింది... దీని నివారణకుఅద్భుతమైన ఔషధం -'నవ్వు'. నవ్వును అలవాటు చేసుకుంటే, మన ఆలోచనల్లో మార్పు పెరుగుతుంది. కష్టమైన పరిస్థితిలో కూడా నవ్వగలిగితే, మనం ఆ పరిస్థితి నుంచి కొంచెం దూరంగా నిలబడి చూడ గలుగుతాం. అప్పుడు మనం ఆ సమస్యకు బలైన వ్యక్తిలా కాకుండా, దానిని గమనిస్తున్న వ్యక్తిలా మారతాం.**


## బ్రేక్ స్టేట్

న్యూరో-లింగ్విస్టిక్ ప్రోగ్రామింగ్ (NLP)లో 'బ్రేక్ స్టేట్' అనే భావన ఉంది. అంటే ప్రతికూల ఆలోచనల ప్రవాహాన్ని అకస్మాత్తుగా ఆపివేస్తుంది. నవ్వు అటువంటి అత్యుత్తమ బ్రేక్ స్టేట్ అన్నమాట.


ఉదాహరణకు, ఆఫీసుపనిలో ఒక చిన్న తప్పు వల్ల భయంతో, ఒత్తిడితో, ఆందోళన చెందుతున్నారని అనుకోండి. అదే సమయంలో మీ సహోద్యోగి చేసిన ఒక సరదా మాట మీకు చిన్న నవ్వు తెప్పిస్తే, ఆ భయపు ఆలోచన వెంటనే ఆగిపోతుంది. భయానికి సంబంధించిన నాడీ మార్గం ఆగిపోతుంది. అప్పుడు కొత్తగా, శాంతంగా ఆలోచించే అవకాశం ఏర్పడుతుంది. నవ్వు గొడవలను చల్లారుస్తుంది, మెదడును సడలించి సృజనాత్మకతను పెంచుతుంది, విశ్వాసాన్ని కల్గిస్తుంది. సంక్షోభ సమయంలో కలిసి నవ్వగలిగే బృందం, ఆ సంక్షోభాన్ని పరిష్కరించగలగుతుంది.

నవ్వుపై పరిశోధనల్లో తేలిన నిజం ఏమిటంటే... నిజమైన నవ్వు, నటించిన నవ్వు మధ్య తేడాను శరీరం గుర్తించదు. చాలా సరదాగా అనిపించి నవ్వినా, అద్దంలో చూసుకుంటూ... "హీ.. హీ.." అని బలవంతంగా నవ్వినా, శారీరక ప్రయోజనాలు దాదాపు ఒకేలా ఉంటాయి. నటించిన నవ్వు కూడా డయాఫ్రామ్‌ను కదిలిస్తుంది. ఇది ఒత్తిడిలో ఉండే పైపై శ్వాసను ఆపేస్తుంది. పది సెకన్లలో నటించిన నవ్వు నిజమైన నవ్వుగా మారవచ్చు. అప్పుడు మన మూడ్ కూడా మారిపోతుంది. ఇదే లాఫ్టర్ యోగా (Laughter Yoga)కి పునాది.

**ఒత్తిడిని సీరియస్‌గా తగ్గించుకోవాలంటే, సరదాగా ఉండటాన్ని కూడా సీరియస్‌గా తీసుకోండి. నవ్వడం ద్వారా మీరు మీ సమస్యలను పట్టించు కోకుండా వదిలేస్తున్నారని కాదు. వాటిని ఎదుర్కొనే శక్తిని మీలో పెంచు కుంటున్నారు, నిజానికి, మీరు మీ ఔషధాన్ని మీరే తయారు చేసుకుంటున్నారు.**






దీన్ని మన దేశానికి చెందిన డా. మదన్ కటారియా అభివృద్ధి చేశారు. లాఫర్ యోగాలో బలవంతంగా నవ్వే వ్యాయామాలు, యోగ శ్వాస (ప్రాణాయామం) కలిపి చేస్తారు.

నవ్వుకు కారణం ఏదైనా సరే, శరీరం ఒత్తిడిని తగ్గించే హార్మోన్లను విడుదల చేస్తుందనే సిద్ధాంతం దీనికి ఆధారం.

కాబట్టి ఒత్తిడిని సీరియస్‌గా తగ్గించుకోవాలంటే, సరదాగా ఉండటాన్ని కూడా సీరియస్‌గా తీసుకోండి.


నవ్వడం ద్వారా మీరు మీ సమస్యలను పట్టించుకోకుండా వదిలేస్తున్నారని కాదు. వాటిని ఎదుర్కొనే శక్తిని మీలో పెంచుకుంటున్నారు, కార్టిసోల్‌ను తగ్గిస్తున్నారు. నిజానికి, మీరు మీ ఔషధాన్ని మీరే తయారు చేసుకుంటున్నారు.

కాబట్టి హాయిగా నవ్వండి. ఎల్లప్పుడు సంతోషంగా వుండండి.

**నవ్వు... మానవ జీవితానికి మూలధనం**

మనిషి పుట్టినప్పటి నుంచి మరణించే వరకూ... అతనితో కలిసి ప్రయాణించే ఒకే ఒక భావం నవ్వు.

భాష తెలియకపోయినా, దేశం మారినా, సంస్కృతి వేరైనా నవ్వు మాత్రం అందరికీ ఒకటే.




శిశువు పుట్టిన కొద్ది నెలల్లోనే నవ్వుతుంది. కానీ అదే శిశువు పెద్దయ్యే కొద్దీ నవ్వు ఎందుకు తగ్గిపోతుంది?

**ఈ ప్రశ్నకి సమాధానమే ఈ వ్యాసం.**

ఆధునిక ప్రపంచం మనకు సౌకర్యాలు ఇచ్చింది, కానీ ఆనందాన్ని తగ్గించింది. వేగం పెరిగింది, కానీ నవ్వుకునే సమయం తగ్గింది.

అయితే నవ్వు విలాసం కాదు... జీవన అవసరం అని ప్రపంచ వ్యాప్తంగా పరిశోధనలు నిరూపిస్తున్నాయి.

**న్యూరోసైన్స్ దృష్టిలో నవ్వు**

అమెరికాలోని Stanford University School of Medicine పరిశోధన ప్రకారం... **నవ్వినప్పుడు...**తర్కం(PrefrontalCortex), భావోద్వేగాలు (Limbic System), శరీరస్పందన(Motor Cortex) అన్నీ ఒకేసారి పనిచేస్తాయి.

**Mayo Clinic (USA) నివేదిక ప్రకారం..**

✦ 10 నిమిషాల గుండెల్లోంచి నవ్వడం, 30 నిమిషాల లైట్ ఎక్సర్సైజ్
✦ రక్తపోటు తగ్గుతుంది
✦ రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

జపాన్‌లోని Osaka Universityచేసిన దీర్ఘ కాలిక అధ్యయనంలో... తరచూ నవ్వే వృద్ధుల్లో గుండె సంబంధిత సమస్యలు 40% తక్కువగా కనిపించాయి.

**ప్రపంచ సంస్కృతుల్లో నవ్వు**

జీవితం ఎంత కష్టమైనా నవ్వు దానిని తేలిక చేస్తుంది. నవ్వు అనేది మనిషి జీవితంలో సహజమైన భావప్రకటన... ఆనందం, సంతోషం, ఆశ్చర్యం, కొన్నిసార్లు అసౌకర్యం వంటి అనేక భావాలను వ్యక్తపరచడానికి మనం నవ్వును ఉపయోగిస్తాము. భాషలు, దేశాలు, సంప్రదాయాలు వేరు అయినప్పటికీ నవ్వు మాత్రం ప్రపంచమంతటా అర్థమయ్యే ఒక సామాన్యమైన మానవ లక్షణం. అందుకే నవ్వును 'సార్వత్రిక భాష' అని కూడా అంటారు. **(సశేషం)**



కథ-కథనం

**యండమూరి వీరేంద్రనాథ్**
**యర్రంశెట్టి శాయి**





# కొంగుచాటు కృష్ణుడు



**గతంలో...** మనుషుల్ని సృష్టించడం చాలా సులభమని, భర్తతో సవాలు చేసి సరస్వతి ముగ్గురు మగ పిల్లల్ని, ఇద్దరు ఆడపిల్లల్ని సృష్టించింది. సరస్వతి సృష్టించిన మొదటి మనిషి పేరు మల్లెమాల బోసు. స్కూల్లో సైన్స్ టీచరు. సరస్వతి సృష్టించిన రెండో వాడు గూటాలపల్లి ఆనందరావు, అమ్మాయిల కోసం ఎన్ని వేషాలైనా వేయటానికి వెనుదీయక పోవటం అతడి చెడుగుణం. మూడోవాడు సాత్వికరావు, పరమ సాత్వికుడు! సరస్వతి సృష్టించిన రెండో అమ్మాయి రాధ. సాత్వికరావు ఆత్మహత్య ప్రయత్నంలో లలిత దగ్గరకు చేరతాడు. ఆనందరావు రాధని పెళ్ళి చేసుకోవాలనే తలంపుతో ప్లాన్లు వేస్తునే క్రమంలో...**ఆ తర్వాత...**

**"పని మీద బయటకి వెళ్తున్నాను. గంటలో వస్తాను" అని లలితకి ఉత్తరం పెట్టి, వసారా బయట తాళం వేసి స్కూల్‌కి బయల్దేరాడు.**

**జుట్టు రేగిపోయి, కళ్ళు పీక్కుపోయి, రాత్రంతా నిద్ర లేనట్టు అర్ధరాత్రి స్కూల్ కి వచ్చిన చంద్రబోసును చూసి వాచ్‌మెన్ ఏమీ ఆశ్చర్యపోలేదు.**

**అర్ధరాత్రి నిద్రలో ఏదో ఐడియా వచ్చినట్టు చంద్రబోస్ అప్పుడప్పుడు ల్యాబ్ కి అలా రావడం మామూలే.**

**ల్యాబ్ తాళాలు అందించాడు.**

**అవి తీసుకొని మైక్రోస్కోప్ దగ్గరికి వెళ్లాడు బోసు.**

**జూకాపై అరగంట పరీక్షలు జరిపిన తర్వాత అతడికి జరిగిందేమిటో అర్థమైంది.**

**తెల్లవారుజామున మూడు అవుతుండగా ఇంటికి వచ్చాడు.**

**లలిత ఇంకా నిద్రలోనే ఉంది.**

**అసలు తను బయటికి వెళ్లి వచ్చిన సంగతి కూడా తెలియకుండా నిద్ర పోతోంది.**

**ముందు గదిలో బల్ల మీద కూర్చొని ఉత్తరం వ్రాశాడు.**

"ప్రధానమంత్రి గారికి,

భారత సైన్యంలో ఉత్తేజం నింపటానికి గతంలో నేను మీకు ఒక ఫార్ములా పంపించాను. నేను మందు ఉపయోగించిన ఆ 'జుకా' మగ ఎలుక. వందల సంఖ్యలో పిల్లల్ని పెట్టటంతో అనుమానం వచ్చి పరీక్షించాను... మందు వాడిన 20 రోజుల తర్వాత ఆ ఎలుక అతి శక్తివంతమైన స్త్రీగా మారి పిల్లల్ని పెట్టింది... మీరు గానీ తొందరపడి మన సైన్యానికి ఈ మందు ఇస్తే భవిష్యత్తులో భారత సైన్యంలో మగ సైనికులు ఉండరు. అందుకనే అర్ధరాత్రి తొందరపడి ఈ ఉత్తరం వ్రాస్తున్నాను. మందు వాడిన వారు జెండర్ మారకుండా ఉండేటందుకు నేను కొన్ని ప్రయోగాలు చేస్తాను. నేను కూడా ఈ మందు తాగాను కాబట్టి దీని అవసరం దేశంతో పాటూ నాకూ ఉన్నది. నా ప్రయోగ ఫలితం మీకు తొందర్లోనే తెలియజేస్తాను. అప్పటి వరకు ఈ మందు మీరు ఎవరి మీదా వాడవద్దు. ఇట్లు చంద్రబోస్."

✦✦✦

"అయిపోయింది. మనం పూర్తిగా ఓడిపోయాం!" విషణ్ణ వదనంతో అన్నది శచీదేవి.

ఇంద్రుడు కంగారుపడి, "ఏమైంది? ఏమైంది?..." అని అడిగాడు.

"ఇంకా అవటానికి ఏముంది? మనం ఏమనుకున్నామో దానికి పూర్తి వ్యతిరేకంగా జరిగింది. హనీమూన్‌కి ఊటీ వెళ్ళిన ఆనందరావూ, జయలక్ష్మి... రోళ్ళూ రోకళ్ళలై ఆనందంగా తిరిగి వస్తున్నారు. కొత్త సంసారంలో రాధా సాత్వికరావులు ఎవరు పైన,ఎవరి మాట కింద అని కాస్త కిందా మీదా పడినా, పగలు రాత్రీ చూడకుండా చిలకా గోరింకల్లా శృంగారం సాగిస్తున్నారు. ఉప్పు నిప్పులా ఉండే చంద్రబోస్, లలితలు అపార్థాలు తొలగి పాలూ నీళ్ళలా

ఒకటై పోయారు. నా మొహం తీసుకెళ్లి కైలాస గుహల్లో దాచుకోవటం తప్ప నాకు ఇంకో మార్గం లేదు. ఇంత చిన్న పని చేయలేక పోయినందుకు దుర్గమ్మ నన్ను శపించినా ఆశ్చర్యపోనక్కర్లేదు".

"ఆయాస పడకు అరవిందలోచనా!... ఆలోచిస్తే మరొక మార్గం దొరక్కపోదు."

"అలసిపోయాను. నేనిక ఆలోచించలేను.... మగవారు... మీరే ఆలోచించండి."

"ఇలాంటి ఆలోచనలకు ఆడవారే ప్రసిద్ధి అని విన్నానే!"

ఇంద్రసతి తక్కువ తినలేదు.

"అర్ధరాత్రి కోడి వేషంలో వెళ్లి అతివల ఇంటి ముందు కూయటం మగవాళ్ళకే అలవాటు అని విన్నానే..." అంది.

ఇంద్రుడు గతుక్కుమని–"పొరపాటు చేయటం మానవ సహజం దేవీ!" అన్నాడు.

"కానీ మనం మానవులం కాదు దేవరా. దేవతలం."

భార్య ధ్యాస మార్చటానికి... "నాకో ఆలోచన వచ్చింది" అన్నాడు మాట మారుస్తూ.

"ఏమిటది?"

"నూరుశాతం బ్రహ్మచర్యం అమలు జరపటంలో తనను మించినవారు ముల్లోకాల్లో ఎవరూ లేరని ఒకప్పుడు నారదులవారికి గర్వం కలిగింది. అప్పుడు ఆయన్ని 'మాయ'లో పడేసి స్త్రీగా మారుస్తాడు మహా విష్ణువు. మాయా మోహంలో నారదుడు సంసారం కూడా చేస్తాడు."

"పార్వతికి ఇచ్చిన మాట గురించి నేను ఆలోచిస్తుంటే, మూలం తప్పిన నారదుడి గురించి మీరు చెప్తున్నారేమిటి?"


"అదే. ఆ విషయానికే వస్తున్నాను... మాయ సృష్టించటం మన చేతిలో పని. మారిపోయిన ఆనందరావు చుట్టూ ఒక మాయ సృష్టిద్దాం. పూర్వపు ఆనందరావుని చేద్దాం... మాయలో పడేసి సాత్వికరావుకి మరికొన్ని ప్రమాదాలు సృష్టిస్తే అతడి మనసు వేయి ముక్కలవుతుంది. రతీదేవి రథం ముక్క చెక్కలవుతుంది."

శచీదేవి మొహం విప్పారింది.


"నిజమే! మంచి ఆలోచన" మొగుడి వైపు మెచ్చుకోలుగా చూస్తూ అంది.

✦✦✦






రాధను దగ్గరకు తీసుకుని ఆకాశం వైపు చూసి... "ప్రియమయిన భగవంతుడా! ప్రపంచంలో ఎవ్వరికీ ఇవ్వని అదృష్టం నాకిచ్చావు. రాత్రింబవళ్ళు నిద్రాహారాలు లేకుండా ఆ అదృష్టాన్ని ఎంత అనుభవించినా తనివి తీరటం లేదు. ఇందుకు కూడా నా కృతజ్ఞతలు. ఆమెన్!" అన్నాడు సాత్వికరావు.




రాధ నవ్వేసి...

"ఏవిఁటా అదృష్టం?" అంది చిలిపిగా.

"ఇంకేమిటి? నీ గురించే దేవుడికి థ్యాంక్స్ చెబుతున్నా."

"చాల్లే గానీ ఇక వెళ్ళండి... బ్యాంక్ తెరిచి అయిదు నిముషాలు అయిపోయి ఉంటుందీ పాటికి!" అంది అతని కౌగిలి బలవంతంగా వదిలించుకుంటూ.

"పోనీ ఈ ఒక్కరోజుకీ సెలవు పెట్టేస్తాను."

"ఇంకెక్కడున్నాయి?... సంవత్సరం సెలవులన్నీ క్రితం నెలలోనే అయిపోయాయి."

"పోనీ లాసాఫ్-పే మీద పెడతాను."

"లాసాఫ్ ఎనర్జీ... లాసాఫ్ పే.... రెండూ నష్టాలే! వద్దు!!" అంది చిలిపిగా.

సాత్వికరావు అయిష్టంగా బ్యాంక్‌కి బయల్దేరి రెండడుగులు వేసి ఆగి... "పోనీ లంచ్ టైంలో వస్తాను!" అన్నాడు.

"వీల్లేదు. చుట్టుపక్కల వాళ్ళందరూ ఇప్పటికే బైనాక్యులర్స్ కొనుక్కుంటున్నారట..." అంటూ బలవంతంగా బయటకు తోసి తలుపు వేసింది.

ఇంతలో... అతను పెరటి తోవగుండా రావటం చూసి ఆశ్చర్యపోయింది.

"వెళ్ళే ముందు ఓ ముఖ్య విషయం నీతో చెప్పటం మర్చిపోయా!"

"ఏమిటది?"

"ఇదీ..." అంటూ పెదాల మీద ముద్దు పెట్టుకున్నాడు. చాలాసేపు విశ్వ ప్రయత్నం చేసి అతన్ని బయటకు తోసి తలుపేసి, వేగంగా వెనక్కు వెళ్ళి పెరటి తలుపు కూడా మూసేసింది.

స్కూటర్ మలుపు తిరిగేంత వరకూ కిటికీలోంచి చూసి... ఒళ్ళు బద్ధకంగా విరుచుకుంటూ వెనక్కు తిరిగి...

'హమ్మయ్య!' అనుకుంది.

సరిగ్గా మధ్యాహ్నం ఒంటిగంటకు కాలింగ్ బెల్ మోగేసరికి 'మళ్ళీ వచ్చేసి ఉంటాడు' అనుకుంటూ ఆనందంగా తలుపు తెరిచింది.

ఎదురుగా మొగుడు చిరునవ్వుతో నిలబడి ఉన్నాడు.

"ఏవిఁటీ అవతారం? ఈ డ్రెస్ ఎక్కడిది?" అని ఆశ్చర్యంగా అడిగింది.

రావు అదిరిపడ్డాడు.


డబల్ యాక్షన్ చాలా సినిమాలు చూసాడు గానీ వాటిల్లో ఏ హీరోయిన్ కూడా డ్రెస్ కంటిన్యుటీ గురించి పట్టించుకుని నిలదీయలేదు.

"అదా?!... అది... మా ఫ్రెండ్ సీతాపతి లేడూ?..."

"మీ ఫ్రెండ్ సీతాపతి అని ఉన్నట్టు నాకు చెప్పలేదే?"

"చెప్పలేదా? అసలు పేరు చెప్పి ఉంటాను. మంగపతి. సీత మొగుడు. అందుకని వాడిని మేమంతా సీతాపతి అని పిలుస్తాం... నన్ను అందరూ రాధాపతి అంటారు. మధ్యాహ్నం ఆఫీసు బాత్‌రూంలో వాడు పడిపోయాడు. బట్టలు పాడయి పోయాయి. నా బట్టలు వాడికిచ్చి, ఓ మై గాడ్. కాదు కాదు! పాపం నేనే పడిపోయాను. వాడింటికెళ్ళి వాడి బట్టలేసుకుని, ఇప్పుడు నా బట్టలు వేసుకెళ్దామని ఇటొచ్చాను."

రాధ నవ్వేసింది.



"అంతేనా? లేక ఈ వంకతో మళ్ళీ ఇంట్లో ఉండిపోవచ్చని వచ్చారా?"

"అబ్బే!... అంతే అంతే..." అంటూ లోపలి కొచ్చాడు.

"త్వరగా మార్చుకెళ్ళండి మరి." అంది రాధ.

ఆనందరావు ఆమెతో పాటూ పడగ్గదిలోకి నడిచాడు.

"నాకంతా తెలుసు... మీరు దీని కోసమే వచ్చారు" అతని నుంచి తప్పించుకోవటానికి ప్రయత్నిస్తూ అంది.

"ఆc...తెల్సిపోయిందా?... ఎలా తెలిసిం దబ్బా!" ఆమెను కౌగిలించుకుంటూ అన్నాడు.

కొద్దిసేపు పెనుగులాడాకా... రాధ అతని కౌగిట్లో ఒదిగిపోయింది.

✦✦✦

కెవ్వుమంటూ అరిచింది రతీదేవి.

"ఏమిటి? ఏమయింది?"

"ఏం జరగటమేమిటి?... ఆ ఇంద్రసతి చూశారా?... సాత్వికరావు రాధల సంసారం నాశనం చేయటానికి ఆనందరావుని పంపిం చింది. మనం ఏదో ఒకటి చెయ్యాలి."

"ఆలోచించి రేపు చెప్తాను!" అన్నాడు మరుడు.

"ఏడ్చినట్లే ఉంది! ఓ పక్క రాధ శీలం గంగలో కలిసిపోతూంటే రేపు చెప్తారా?... త్వరగా చెప్పండి. అక్కడ ఆనందరావు రాధ శరీరమంతా ముద్దులతో ముంచెత్తుతున్నాడు!" అని కంగారు పెట్టింది.

"దానికంత ఆలోచనెందుకు? ఆ రాధ భర్తని వెంటనే ఇంటికి రప్పిస్తే సరి!"

మరుక్షణంలో రతీదేవి వాయుదేవుణ్ణి బ్రతి మాలి బ్యాంక్ ముందు దిగింది.


బ్యాంక్ బయటే ఉన్న ఓ మెడికల్ షాప్‌లోకి వెళ్ళి టెలిఫోన్ డైరెక్టరీ చూసి బ్యాంక్ మేనేజర్‌కి ఫోన్ చేసింది.

"హలో!" అన్నాడు బ్యాంక్ మేనేజర్.


"నేను ఢిల్లీ నుంచి ప్రధాన మంత్రి ఫైనాన్స్ సెక్రెటరీని మాట్లాడుతున్నాను."

"గుడ్ మార్నింగ్ మేడం!" అన్నాడు బ్యాంక్ మేనేజర్.

"నీకేమైనా బుద్ధుందా?" **(సశేషం)**








# క్లియరెన్స్ సేల్

వేలూరి ప్రమీలా శర్మ, 9492535415

"ఒకటి కొంటే ఒకటి ఫ్రీ అంటూ... పండగ ఆఫర్లో వస్తువులు కొనుక్కొచ్చి మా ఆవిడ ఈ నెల నా జీతం మొత్తం ఖర్చు పెట్టేసింది రా!... ఆనక ఎక్స్పైరీ డేటు దాటిపోయాయని వాటిని తీసుకెళ్ళి డస్ట్‌బిన్‌లో పడేయించింది. చివరికి చెత్త తీసే వాడికి చేతిలో 500 పెడితే గానీ... అవేవీ పట్టుకెళ్ళనని పేచీ పెట్టాడు. పండక్కి చుట్టాలు వస్తారంటే పస్తు పడుకో బెట్టేలా ఉంది పరిస్థితి..." బేరమన్నాడు హిందోళం ఆందోళనగా.

"హబ్బా! ఎప్పుడూ విచార వదనమేనా? నిన్ను చూస్తే నాక్కూడా నీరసం వచ్చేస్తుంది. ప్రతీ నెలా ఏదో ఒక సమస్య చెబుతూనే ఉన్నావు. సంతోషంగా ఉన్న మాసం ఒక్కటీ లేదా నీ జీవితంలో!" విసుగ్గా మొహం చిట్లించాడు ఆదితాళం.



"నీకేం!?...ఎన్నయినా అంటావు. చెల్లెమ్మని అమాయకురాల్ని చేసి, శృతి మార్చనీకుండా నోటికి తాళం వేసేస్తావు... కాబట్టి నీ జీవితం సాఫీగా నడిచిపోతోంది.నాకంత అదృష్టం లేదు. మా ఆవిడ ఏ రాగంలో ఎప్పుడు ఎలా విరుచుకుపడుతుందో తెలీక ఖంగారుపడి చస్తున్నాను. అరెకరం పొలానికి ఆశపడి నాకన్నా మూరెడు ఎత్తున్న దాన్ని పెళ్ళి చేసుకున్నాను...పెళ్లయ్యాక నా వీపు గూని మరికాస్త పెరిగిందే తప్ప తగ్గలేదు." ఏడుపు గొంతు పెట్టేసాడు హిందోళం.

"హబ్బబ్బా! అలా బేలగా మాట్లాడకురా హిందోళం!... ప్రతి దానికి ఏదో ఒక పరిష్కారం ఉంటుంది. నీలాంటి వాడిపైనే ఆ మధ్య నేను రాసిన కవిత ఒకటి 'సాయంత్రం' దినపత్రికలో 'సంధ్యా చీకటిలో వెలుగు రేఖలు' పేరిట ప్రచురించబడింది. దానికి పారితోషికంగా నేను అందుకున్న వెయ్యి రూపాయలతో మా ఆవిడకి బ్రహ్మాండమైన చీర కొనిపెట్టాను. ఈ వార్త నీ దాకా చేరినట్టు లేదు!..." అన్నాడు ఆదితాళం.

"ఎందుకు చేరలేదూ! నీ కవిత పడిన పేపరు పట్టుకెళ్లి మా ఆవిడకి చూపించానా...?"

"ఆ చూపిస్తే ఏమంది??..."


"ఏదైనా అనడానికి అసలు నీ కవిత చదివితే కదా!"


"మరి...!?"

"నీ కవిత పడిన పేజీలోనే పక్కనే క్లియరెన్స్ సేల్ ప్రకటన ఒకటి చూసింది. వెంటనే ఆ అడ్రస్‌కి తీసుకెళ్లమని నాకు ఫోన్ చేసింది... ఆఫీసులో వర్క్ ఎక్కువగా ఉండటం వల్ల... నాకు వీలుపడక తననే వెళ్ళమన్నాను. ఆరోజు నేను ఇంటికి వెళ్లేసరికి మా ఆవిడ పరిస్థితి చూసి..." ముక్కు చీదేసాడు హిందోళం.

"అయ్యో! ఏమైంది??..."

"బొంతల్లా వాచిపోయిన పాదాలతో బాతులా నడుస్తూ నుంచోలేక, పడుకోలేక... నానా అవస్థ పడుతోంది. కాళ్లు అరిగేలా తిరిగినా క్లియరెన్స్ సేల్ షాపు ఎక్కడుందో కనపడక...పేపర్లో ఉన్న నెంబర్‌కి ఫోన్ చేస్తే... ఈవారం కాదు వచ్చేవారం నుంచి అని చెప్పాడట. గంటల తరబడి తిరిగినందుకు కాళ్లు నొప్పులు వచ్చాయని... అరిగిపోయిన మోకాలి చిప్పలు రుద్దుకుంటూ వాడి మీద కయ్ మని అరిచిందట. మీకు కలిగిన తలనొప్పి, చికాకుకి కారణం మేమే కాబట్టి... అందుకు బాధ్యతగా




మీకు ఒక  చిన్న పార్సెల్ పంపి స్తాము అని చెప్పి ఫోన్ పెట్టే సాడట."

"మరింకేం?... సంతోష మేగా!...ఇంతకీ ఏముంది ఆ పార్సెల్లో?"

"పార్సెలా నా బొందా!!... జెప్టోలో నాలుగు జిల్లేడాకులు పంపించి, కాళ్ళ నొప్పులు తగ్గించుకోమని ఉచిత సలహా ఒకటి పడేసాడు.... జిల్లేడాకులు మరిగించిన నూనె కాళ్ళకి రాయ మంటావా బంగారం! అని అడిగానో లేదో..."

"ఊc!... ఏమంది? చెప్పు! ఆత్రం ఆగక చస్తున్నాను... ప్రేమగా నిన్ను దగ్గరకి తీసుకుందా?"

"తలనొప్పి అంటే మోకాలికి మందు రాస్తారేంటని ... ఇదిగో... ఇలా!" తలమీద లేచిన రెండంగుళాల బొప్పిని చూపించి తడుము కున్నాడు హిందోళం.

"ఊ! అర్థమయ్యింది."

"ఏమిటి ఊc?... ఇంకా పూర్తవ్వందే... ఆ షాపు వాడిని బతి మాలుకుని మా ఆవిడ తలనొప్పి తగ్గడానికి నానా గడ్డీ కరిచాననుకో!"

"అయితే షాపు ఓపెన్ చెయ్యకపోయినా మీ ఆవిడ చేతిలో చీరేదో పెట్టి తలనొప్పి తగ్గించి ఉంటాడు. యామ్ ఐ కరెక్ట్?" కళ్లెగరేసాడు ఆదితాళం.

"ఏమిటి పంపించేది?... ఈసారి జెప్టోలో జండూబామ్ పంపించి చేతులు దులుపుకున్నాడు... అది కూడా మా ఆవిడకి తెలీకుండా వాడి చేతిలో నేనో వంద రూపాయలు పెట్టాక!"

"హ్హా...హ్హా...హ్హా! నీలాంటి బేరం తగిలితే ఆ షాపువాడు క్లియరెన్స్ సేల్‌లో ఎన్ని శారీసైనా అమ్ముకుంటాడు... ఇంకా నయం. ఈ విషయం మా ఆవిడ దాకా రాలేదు... నేనొస్తా!!!"

పచ్చని పంట పొలాలతో, పైరగాలి పలకరింపులతో మనసు పులకరించే డేస్..
నిండుగా ప్రవహించే గోదావరి కాలువలో, గూడు పడవలపై తెరచాపలు రెపరెపలాడిన డేస్..
ఊరంతా వినపడే బొగ్గు ఇంజిన్, ఛుక్ ఛుక్ రైలు కూతలు సందడి చేసే డేస్..
కష్టనష్టాలెన్నున్నా, చీకూచింతలెదురైనా, ఒక్కసారి బాల్యంలోకి తిరిగి చూస్తే.. అన్ని స్వీట్ మెమొరీస్ హ్యాపీ డేస్..
అలాంటి భీమడోలు డేస్ ముచ్చట్లు చెప్పడానికి, బాపు గారి మహాబలిపురం గైడ్ బాలరాజు లాగా,
ముళ్ళపూడి బుడుగు లాగా, మాల్గుడి డేస్ స్వామి లాగా... భీమడోలు బాలరాజు సూర్య
వచ్చే సంచిక నుంచి... భీమడోలు తీసుకెళుతున్నారు... రడీగా ఉండండి!



Reverse Gear
# వెనక్కి వెళ్ళే కథలు



గంగాధర్ వడ్లమన్నాటి-
9908445969

## నిర్ణయం వెనక్కి!

జగదాంబ తలుపు తీయగానే... పుల్లారావు నమస్కారం పెడుతూ...

"అమ్మా! నేను గురువింద పార్టీ అధ్యక్షుడు పుల్లారావుని. మన శేఖరంగారిని కలవాలని ఇలా వచ్చాను... ఆయన ఉన్నారా?" అడిగాడు అరికాళ్ళెత్తి లోపలికి తొంగి తొంగి చూస్తూ.

దాంతో జగదాంబ గుమ్మానికి అడ్డుగా నిలబడి–

"ఆయన ఉన్నారు కానీ...మీరు ఎందుకు వచ్చినట్టో చెప్తారా?" అడిగింది ఒకడుగు ముందుకు వచ్చి.

దాంతో పుల్లారావ్ కాస్త వెనక్కి జరుగుతూ...

"అదేనమ్మా! మా పార్టీ ఆయనకి ఏరి కోరి, ఎమ్మెల్యే టికెట్ ఇస్తే... వద్దని వెనక్కి వెళ్లిపోయారు. అందుకని...ఎందుకని... వద్దన్నారో తెలుసుకుని, ఆయనకి జరిగే నష్టం వివరంగా వివరించి... ఎమ్మెల్యేగా పోటీ చేయమని అడుగుదామని వచ్చాను." చెప్పాడు పళ్ళికిలిస్తూ...

"లేదన్నయ్యగారు! ఆయన మాట మార్చుకోరు...ఎందుకంటే, ఆయన ఆల్రెడీ నిర్ణయం తీసేసుకున్నారు!... పైగా ఆయనకు నచ్చ చెప్పలేక నా నోరు, చేతులు పడిపోయాయంటే నమ్మండి. మొత్తానికి రాజకీయాలు వద్దని విరమించుకున్నారు. అదే నాకు సంతోషం.ఆయన వెనక్కి మళ్లడంలో నా పాత్ర కూడా ఉంది!" చెప్పింది గర్వంగా.

పుల్లారావు ఆలోచిస్తూ...

"అదేమిటమ్మా!...నచ్చ చెబితే నోరు నొప్పి పెట్టాలి కానీ, చేతులు కూడా నొప్పెట్టడం ఏవిటమ్మా! చిత్రంగా ఉంది!!" అయోమయంగా చూస్తూ అడిగాడు.


"అదే అన్నయ్యగారు! ఆయన చేతులు పట్టుకుని... గడ్డం పట్టుకుని... బ్రతిమాలి చెప్పి చెప్పి అలా! మీరు వచ్చి మళ్ళీ కథ మొదటికి తేకండి!"

"అలా అనకమ్మా! నువ్వు ఒకవైపే చూశావ్! రెండో వైపు చూడలేదు. ఏదైనా సరే...కాళ్ళ దగ్గరకొచ్చిన బేరం కాశీకి పోయినా దొరకదంటారు. వచ్చిన అవకాశాన్ని ఫుట్‌బాల్‌లా కాలదన్నుకుని పాడు చేసుకోకూడదు. కనుక నేను కూడా ఒక మాట చెప్తాను... ఒప్పుకునేది, లేనిది ఆయన ఇష్టం!" అన్నాడు పుల్లారావ్.

"సరే మీ ఇష్టం! ఆయన ఆ పెద్ద గదిలో ఉన్నారు వెళ్ళండి!..." అంది చిరాగ్గా.

ఆ గదిలోకి వెళ్లి...శేఖరానికి ఎదురుగా కూర్చుని–

"చాలా విచిత్రంగా ఉంది మీ వరస. స్వయంగా ముఖ్యమంత్రిగారే మీ ప్రజాసేవ కార్యక్రమాలు మెచ్చి, మీరు ఆయనకి నచ్చి, ఇలా నిలుచుంటే అలా గెలిచిపోయే నియోజకవర్గంలో మీకు ఎమ్మెల్యే సీటు




ఇస్తే... ఇలా వద్దని వెనక్కి వెళ్లిపోతారా?... నాకైతే చాలా విచిత్రంగా అనిపిస్తోంది. మీరు ఎమ్మెల్యే అయితే, ప్రజాసేవ ఇంకా బాగా చేయొచ్చు కదా!ఆ విషయం ఆలోచించారా?" అడిగాడు పుల్లారావు.

"నేను మీరన్నట్టే, అంటే ఎమ్మెల్యే అయిపోతే ఇంకా బాగా ప్రజాసేవ చేయొచ్చు అనుకున్నాను. కానీ నాకు ఇలా ఆ నియోజకవర్గం సీటు ఇచ్చారని తెలిసి తెలియగానే... మా కుల సంఘం అధ్యక్షుడు వచ్చి, నాకు శుభాకాంక్షలు చెప్పాడు. తర్వాత మా కులం వాళ్ళందరినీ పార్టీలో సభ్యులుగా చేర్చాలని నా బుర్ర తినేసాడు... అతని బాధ పడలేక సరే చూద్దాం అన్నాను.

తర్వాత మరో నాయకుడు ఫోన్ చేసి– 'మన కులానికి ద్రోహం చేసినవాడు ఆ ప్రతిపక్ష పార్టీ సుబ్బారావని చెప్పాలని నా చెవిలో జోరీగలా పోరాడు. పోనీలే అనుకున్నాను.

తర్వాత రోజు నేను... అనాథ పిల్లలకు బట్టలు పంచబోతుంటే... పోలోమని మన పార్టీ కార్యకర్తలు నాలుగైదు టీ.వీ. ఛానళ్ళ వారితో వచ్చి... ఈ కార్యక్రమం పార్టీ చేస్తోందనే రంగు పులిమారు. తర్వాత మన పార్టీకి జై అంటూ పెద్ద అరుపులు, నినాదాలతో హోరెత్తించి పడేసారు. దాంతో పిల్లలు, పిల్లుల్లా భయపడి, వారి, వారి... గదుల్లోకి పోయి నక్కల్లా దాక్కున్నారు... కనుక ఇలా నన్ను కంట్రోల్ చేసే ఈ పదవి నాక్కర్లేదు. పైగా ఇన్నాళ్ళు నేను సేవ చేసింది... ఇలా దొడ్డిదారుల్లో రాజకీయాల్లోకి రావడానికే అని ప్రతిపక్ష పార్టీ వాళ్ళు నామీద దుమ్మెత్తి పోస్తున్నారు. కనుక నేను చేసే సేవ పక్కకు పోయి, కేవలం ఈ రాజకీయాలతోనే నాకు తెల్లవారిపోయేటట్టుంది. అందుకే... నాకు ఈ రాజకీయాలు వద్దు!... నేను పార్టీ సభ్యత్వానికి కూడా రాజీనామా చేసేసి వెనక్కి వచ్చేసాను. నేను నాకు తోచింది నేను చేసుకుంటాను... ప్రశాంతంగా ఉంటాను!" అన్నాడు శేఖరం నేల చూపులు చూస్తూ.




"ఓస్!... వీటికేనా మీరు ఇలా తుస్ అయిపోయేది. అలా అయితే ఇంకా ముందు ముందు చాలా వస్తాయి. మొనగాడిలా వాటిని మీరు ఎదుర్కొని ధైర్యంగా నిలబడాలి... అంతేగాని ఇలా మెతక మనిషిలా మెత్తబడిపోయి, చచ్చుమనిషిలా చచ్చుబడిపోయి,ఇలా ఏదో అయిపోయి వెనక్కి వెళ్ళిపోతారా?... అయినా ఇవి తర్వాత్తర్వాత సర్దుకుంటాయి!" చెప్పాడు పుల్లారావు.


శేఖరం సీలింగ్ వైపు చూస్తూ, కళ్ళు తుడుచుకుంటూ...

"నాకు ఏది ఎదురైనా సరే... కొంచెం తట్టుకుని నిలబడేవాడిని. కానీ ఇందులోకి, మా ఆవిడని కూడా లాగారు దరిద్రులు. అసలే మా ఆవిడకి చేయాడింపు ఎక్కువ... దాంతో నన్ను నిన్న సాయంత్రం కసితీరా పిడికిలి బిగించి మరీ కడుపులో గుద్దింది... దాంతో నేను బాధతో కడుపుపట్టుకుని ఒంగున్నాను. అలా వంగగానే...వెంటనే వీపు మీద దబీదబీమని రెండు గుద్దులు గుద్దేసింది... ఇక ఏం చేయాలో పాలుపోక, వెంటనే బాత్రూంలోకి వెళ్ళి గెడపెట్టుకుని... వెక్కి వెక్కి ఏడ్చాను. అందుకనే ఇక ఈ రాజకీయాలు నాకు అవసరం లేదు!" చెప్పాడు కరాకండిగా.

"అయినా మీ ఆవిడని ఇందులో లాగడం ఏమిటి! అసలు ఏం జరిగింది?" అడిగాడు పుల్లారావ్ ఆశక్తిగా.

"ఇంకేం జరగాలి?మా ఆవిడ నన్ను చూసి స్ఫూర్తి పొంది... పేదలకు సాయం చేయాలని పైసా వడ్డీ తీసుకోకుండా,పేదవాళ్ళకి కుట్టు మిషన్ కొనుక్కోవడానికి... పలుగు, పార కొనుక్కోవడానికి, తోపుడుబండ్లు పెట్టుకోవడానికీ కావలసిన డబ్బుల్ని అప్పు ఇచ్చి, వాళ్ళు ఇచ్చినప్పుడే తీసుకుంటుంది...

ఒక వేళ ఎవరైనా ఇవ్వలేకపోతే, సరేలే అని ఊరుకుంటుంది. ఇలాగే కొన్ని సంవత్సరాలుగా చేస్తోంది...




అలాంటి మా ఆవిడని పట్టుకొని, డైలీఫైనాన్స్, అధిక వడ్డీకి పేదల రక్తం పీలుస్తోందని... ఎంతో డబ్బు ఇలాగే వెనకేసిందని చెప్పి ఆవిడ మీద కథనాలు వండి వార్చారు ప్రతిపక్షం వాళ్ళు... దానికి బలం చేకూర్చేందుకు ఒకరిద్దరికి డబ్బులు ఇచ్చి, కొందరికి డబ్బులు ఆశ చూపి, మా ఆవిడపై తప్పుడు ప్రచారం చేశారు. దాంతో నీ రాజకీయ ప్రవేశం నా పరువుని మంట కలిపింది!" అని నన్ను రోజూ గుర్తొచ్చినప్పుడల్లా చితక్కొట్టి పారేస్తోంది. కాబట్టి వద్దు ఇక చాలు!" అన్నాడు శేఖరం దండం పెడుతూ.

'ఇందాక ఇతని శ్రీమతి, నచ్చచెప్పడానికి చేతులు నొప్పిపెట్టాయి అనడంలో అసలు మతలబు ఇదన్నమాట!' అని లోలోపల అనుకుని...

పైకి "మీలాంటి అమాయకుల్ని ఎవరూ బాగు చేయలేరు... అక్కడ నిలబడే వారు మాకు దొరక్కపోరు. పార్టీ ఫండ్ ఇచ్చి మరీ ఈ సీటు కొంటారు!" అని పుల్లారావ్ చెప్తుండగానే... ఆశక్తి లేనట్టు మొహం తిప్పేశాడు శేఖరం.



# కేసు ముగిసింది

పి.ఎల్.ఎన్.మంగారత్నం,9701426788

**కోర్టు ఆవరణలో...**

**ఆ భార్యాభర్తలు ఇద్దరూ చాలా అసహనంగా... కొంత భయంగా మరికొంత కోపంగా... ఎదురెదురుగా నిలబడి ఉన్నారు.**

**వారి చేతుల్లో పోలీసువారు అందించిన నోటిసులు రెపరెప లాడుతున్నాయి.**

**'అంతా నీ వల్లే!' అన్నట్లు ఉన్నాయి భర్త రాజేశం చూపులు.**

**అతనితో పాటు అతని తల్లి నీతిమతి, చెల్లి చంద్రవదన కూడా ఉన్నారు.**

**అంత దానికి... ఇంత జరిగిపోతుందని అనుకోలేదు... అన్నట్లు బిడియపడుతున్నారు. వాళ్ళు కూడా ఐ.పి.సి సెక్షన్ 498బి క్రింద నమోదు అయిన కేసులో భాగస్వాములు కావడంతో.**

భార్య భ్రమరాంబికకు తోడుగా తండ్రి వచ్చి ఉన్నాడు.

భర్త చూపులు ఆరోజు విషయాన్ని మరోసారి గుర్తుకు తెచ్చాయి భ్రమరాంబికకు.

✦✦✦

ఓ రోజు ఆఫీసుకి...

ఇన్స్టాల్మెంట్స్‌లో చీరెలు అమ్మే అతను వస్తే, తోటివాళ్ళతో పాటు తనూ ఒక ఎర్రరంగు పూల చీరె కొనుక్కుంది.

అప్పటికే తనకు ఓ ఎర్రరంగు జాకెట్టు ఉండడంతో మరో జాకెట్టు కుట్టించాల్సిన అవసరం లేదనుకుంది ఇంటి బడ్జెట్టునీ దృష్టిలో ఉంచుకుని. అయితే... పెద్ద పండుగకు కాస్త ముందుగా ఆ చీరె టైలరుకి ఇచ్చుకోవాలని... ఇల్లంతా వెతికి, వెతికి.. విసిగి వేసారిపోయిన తరువాత, తమకు నాలుగిళ్ళ దూరంలో ఉండే చిన్న ఆడపడుచు 'చంద్రవదన' ఓసారి ఇంటికి వచ్చిందనీ... తను కొనుక్కున్న ఆ ఎర్రరంగు పూల చీరె ఆమెకూ నచ్చేయ్యడంతో.. పట్టుకెళ్ళిపోయిందనీ, ఆ విషయం అడిగేంత వరకూ అత్తగారు చెప్పక పోవడంతో కోపం కట్టలు తెంచుకుంది.

"అదేమిటి? అత్తయ్యా!...ఉద్యోగం చేసి సంపాదిస్తున్నా కూడా నా సంపాదన మీద నాకు స్వతంత్రం లేదా? నాకు తెలీకుండా నా వస్తువు పట్టుకుపోతుందా చంద్ర! మీరైనా ఎలా ఇచ్చారు?... ఒకేసారి మొత్తం డబ్బు ఇచ్చేస్తే 'ఓ పాతిక రూపాయలు' తగ్గేవి. అయినా, అంత వెసులుబాటు లేకే కదా! ఇలా కొనుక్కోవడం" అంటూ ఆవేదన పడింది.

"ఏదో మనసు పడింది. పట్టుకెళ్ళింది... నా కూతురికి స్వతంత్రం లేదా నా ఇంటిలో!... అయినా, నీకు ఎన్ని చీరెలు లేవు?" అంటూ అత్తగారి వితండవాదన.

"నేను బయటకు వెళ్ళేదాన్ని నాకు ఉండాలి. మీ అమ్మాయి ఏమైనా బయటకి వెళుతుందా?" అడిగింది.

అయినా, అత్తగారు కూతుర్నే సమర్ధించడంతో మాటా మాటా పెరిగింది.

అసలు కోడలు ఏం కొనుక్కున్నా ముందు నచ్చునిది అత్తగారికే.

అలాంటివి తన కూతుర్లకు ఉండవన్న న్యూనతే.

గొడవకి అక్కడే ఉన్న రాజేశంకి భార్య మీదే కోపం వచ్చింది. తన ఎదురుగానే తన వాళ్ళను మాటలనడం అస్సలు నచ్చలేదు. కోపం కూడా వచ్చెయ్యడంతో...


"ఎంత సేపే గొడవ... ఇక తగ్గేదే లేదా?" అంటూ భ్రమరాంబిక మీదే లేచాడు.

ఆమె నోరుతెరిచి... ఏదో సమాధానం చెప్పేంతలో...

కోపం తీరక చెయ్యి కూడా చేసుకున్నాడు తనదైన రీతిలో. కట్టుకున్న భార్యను అదుపులో పెట్టుకోవాలంటే అదో ఆయుధం మగవాడికి. కొడుకు చేసిన పనికి అత్తగారూ అడ్డు చెప్పక పోవడంతో అవమానం తట్టుకోలేకపోయింది భ్రమరాంబిక.

ఆఫీసులో అందరూ 'మేడం.. మేడం' అంటే ఇంట్లో పరిస్థితి మాత్రం ఇలాగ! తనో డబ్బు సంపాదించే యంత్రం అయిపోయింది అన్నట్లు. పగిలిన పెదవిని చూసుకుంటూ...

"నా మీదే చెయ్యి చేసుకుంటావా?... నీ వైపు



నుంచి తప్పు ఉంచుకుని కూడా... నా కన్నా చిన్న జీతగాడివి నీకే అంత పొగరు ఉంటే... నాకెంత ఉండాలి?" అంటూ ఇంటి నుంచి బయటకు వెళ్లి... పబ్లిక్ టెలిఫోన్ బూత్ నుంచి పోలీసు స్టేషనుకి ఫోన్ చేసి. అటు నుంచి అటే పుట్టింటికి వెళ్ళిపోయింది.

అది 'గృహ హింస' కేసుగా నమోదు అయ్యింది.

దాని పర్యవసానమే ఇలా కోర్టు మెట్లు ఎక్కడం

✦✦✦

ఇద్దరూ ఉద్యోగస్తులు కావడంతో సత్వర పరిష్కారం కోసం కాస్త హడావుడిగా అందినయ్యి నోటిసులు.

కేసు పిలవగానే...

ఇద్దరూ ఆ నోటీసుల్నీ, తమ వాగ్మూలాన్నీ మేజిస్ట్రేట్ ముందు ఉండే, బెంచి క్లార్క్ ముందు ఉంచారు. ఎవ్వరూ లాయర్నలను పెట్టు కోలేదు. అంత ఆర్థిక స్తోమత్తు లేక. ఇప్పటికే పరువు పోయి వీధిన పడ్డట్లు అయ్యింది సంసారం. బెంచి క్లార్క్ ఆ నోటిసుల వైపూ, వారి వైపూ కాస్సేపు నొసలు చిట్లించి చూసి... సరిగ్గా అర్థం కాని అయోమయంలో... అలాగే పై నున్న మేజిస్ట్రేట్గారికి అందించాడు.

ఆ నోటిసుల్ని చూసిన మేజిస్ట్రేట్గారు కూడా అలాగే ఆశ్చర్యంగా చూస్తూ...

"చెప్పండి!" అన్నారు.

విషయం వివరించింది ఆమె.

అతను కూడా తను చెప్పుకునేది చెప్పు కున్నాడు.

చివరిగా "అలా కొట్టడం తప్పే!... ఇక అలా చెయ్యను" అంటూ వప్పు కున్నాడు పశ్చాత్తాపం ఉట్టి పడేలా!

ఏ సమస్యకైనా ఓ పరిష్కారం ఉంటుందన్న దిశలో. ప్రక్కనున్న తల్లీ,చెల్లీ కూడా అలాగే, తల దించుకున్నారు.

మేజిస్ట్రేట్ ముఖంలో నవ్వు.

"అసలు వీళ్ళకి ఈ నోటిసులు అంటే... ఎల్ ఓ సీ లు జారీచేసింది ఎవరయ్యా?" అడిగారు నవ్వుతూ.

అక్కడే కేసు తరుపున వచ్చిన కానిస్టేబుల్ని చూస్తూ.

'ఏమో! నాకు తెలీదు. నేను కాదు!' అన్నట్లు చూస్తూ సైలెంటుగా ఉండిపోయాడు.

"ఇవి 'లుక్ అవుట్ సర్కులర్' లు. ఇవి ఎవరికీ ఇస్తారో! తెలుసా"



అడిగారు కానిస్టేబుల్ని ఉద్దేశించి.

ఇక నోరు తెరవక తప్పలేదు కానిస్టేబుల్‌కి.

"సార్!..."అంటూ మేజిస్ట్రేట్‌గారి ముందు ఇబ్బందిగా కదిలాడు. టోపీ సరిచేసి పెట్టు కుంటూ.

అతని అవస్థని చూస్తూ...

"కాస్త మనసు పెట్టి పని చెయ్యండయ్యా పోలీసువారూ!... అన్ని కేసులకీ మీ ఇష్టా రాజ్యంగా, యాంత్రికంగా 'లుక్ అవుట్ సర్క్యు లర్'ను జారీ చేస్తే ఎలాగ?"


"వీటిని తీవ్రమైన నేరాలూ, ఆర్థిక అక్రమా లకు పాల్పడిన వారు దేశం విడిచిపెట్టి పారిపో కుండా ఉండేందుకు దర్యాప్తు సంస్థలు గానీ, పోలీసు అధికారులు గానీ ఇటువంటి 'లుక్ అవుట్ సర్క్యులర్లు' జారీ చేస్తారు. అంతేగాని గృహ హింస కేసులకు కాదు!"

"వైవాహిక వివాదాల కేసులు చాలా వరకు రాజీ ద్వారా ముగించాలి. కాబట్టి, మీరు జారీ చేసిన ఈ ఎల్ ఓ సీ ని కొట్టేస్తున్నాను!..." అని తీర్పు చెబుతూ...

"వాళ్ళు ఇప్పటికే ఆవేశం తగ్గించుకుని ఆలోచిస్తున్నారు కాబట్టి... కేసును కోర్టు బయటే ముగించమన్నాని మీ స్టేషన్ హౌస్ ఆఫీసరుగారికి చెప్పు!" అంటూ ముగించారు.

"సర్!..." అంటూ మరింత గౌరవంగా సెల్యూట్ చేసాడు కానిస్టేబుల్.

"హమ్మయ్యా!..." ఊపిరి పీల్చుకున్నారు ఇద్దరూ.




మేజిస్ట్రేట్ ముందు రాజేశం తప్పు ఒప్పుకో వడంతో పెద్ద బరువు దిగిపోయినట్లయ్యింది భ్రమరాంబికకు.

"వదినా!... నువ్వు కొనుక్కున్న చీరె, నీకు తెలీకుండా నేను పట్టుకుపోవడం తప్పే... ఆ ఎర్రరంగు పూలతో పాటు... పసుపు రంగు పూలు కూడా ఉన్నాయి కదా! నా దగ్గర అలాం టిదే పసుపు రంగు జాకెట్టు ఉండడంతో తీసుకుపోయాను. ఇప్పుడు చీరె నీ కప్ బోర్డు లోనే ఉంది. ఇంటికి వచ్చెయ్యి!" అంటూ చెయ్యి పట్టుకుంది ఆడపడుచు చంద్ర.

పెళ్ళికి ముందు కాబోయే కోడలి గవర్న మెంటు ఉద్యోగాన్ని చూసే ఇష్టపడింది నీతి మతి, కొడుకుది ఎలాగూ ఎదుగు బొదుగూ లేని ఫేక్టరీ ఉద్యోగం కావడంతో.

అయినా తల్లి మనస్సు ఎప్పుడూ తన పిల్లల గురించే ఆలోచిస్తుంది అన్నట్లు ఆలోచించి... గొడవకు కారణమైంది.

"అమ్మా! ఏదో అనుకోకుండా అలా జరిగి పోయింది. ఇక గొడవలు లేకుండా ఉందాం. ఇంటికి వచ్చెయ్యి! " అంటూ కోడలితో అన డంతో కరిగిపోయింది భ్రమరాంబిక.


జీవితం అన్న తరువాత పట్టువిడులు ఉండాలి... పోలీసువారు ఇచ్చిన నోటిసుల్ని కోర్టు కొట్టేసింది. పరిష్కారమార్గాన్ని కూడా తెలిపింది. మళ్ళీ వచ్చే నోటిసులకోసం ఎదురు చూడకుండా!

సర్దుకు పోతేనే సంసారం అనుకుంటూ, 'రేపు పోలీసు స్టేషనుకి వెళ్ళి రాజీ పత్రం వ్రాసి ఇవ్వాలి కేసు ముగిసి పోయేలా' అనుకుంది భ్రమరాంబిక!

ఇంత గొడవకు కారణమైన ఆ చీరెను ఇంకా తను కట్టుకుంటుందా? వెళ్ళేటప్పుడు పుట్టింటి కానుకగా ఆడపడుచుకే ఇచ్చేయాలి. అనుకుంది తేలిక పడిన మనసుతో.

భర్తా, అత్త, ఆడపడుచులతో కలిసి ఆటో ఎక్కింది భ్రమరాంబిక నెల రోజుల తరువాత.

వెనుదిరిగాడు తండ్రి.



జులై,5 సరసిగారి పుట్టిన్రోజు సందర్భంగా...

# 'మనమీదేనర్రోయ్'

-సరసి




ఏ మనవడో మనవరాలో వచ్చి...'తాతా' అని పలకరిస్తే ఎంత పనిలో ఉన్నా ఏ తాతా విసుక్కోడు. అమెరికా ప్రెసిడెంట్‌తో ఫోన్లో మాట్లాడుతున్నా సరే తోసెయ్యడు... ఏతావాతా చెప్పేది తాతలకి అంత ప్రేమ ఉంటుంది మనవలంటే!

అలాగే నా కార్టూన్ క్యారెక్టర్లు కూడా నాకు మనవల్లాంటివే...ఒకటా రెండా 46 ఏళ్ల నించి సాకుతున్నానాయే!

అయితే ఇంతకాలం అవి నన్ను అలరించాయి. పలకరించాయి. మురిపించాయి. కొన్ని 'మా మనోభావాలు దెబ్బతిన్నాయి' అని తిట్టాయి. 'ఎప్పుడూ మా మీదేనా పడి ఏడవటం' అని కొన్ని ఏడ్చాయి.

'నీ స్వీయానుభవమా?' అని అనుమాన పడ్డాయి.

'మా బాధలు చెప్పేవయ్యా తేంక్యూ' అన్నాయి కొన్ని భుజం తట్టి.

కొన్ని 'మా ద్వారా కొందరి జీవిత కాలాన్ని పొడిగించావయ్యా' అంటూ మెచ్చుకున్నాయి.

కొన్ని జంతువులు గడ్డి పెట్టాయి! 'అంతెందుకు... నీకు అంతో ఇంతో జనాల్లో పేరు వచ్చిందంటే అది మా వల్లే కదా!' అని గర్వంగా ఫోజిచ్చాయి!


'మనల్ని మనకి అద్దంలో చూపెట్టాడ్రా...మనమే కదా ఇవన్నీ!' అన్నాయి సీనియర్ పాత్రలు పాత్రోచితంగా.

అవి సన్మానించినా అవమానించినా నేనేం ఫీల్ అవ్వను. నాకు ప్రేమే వాటి మీద. ఇలా సుమారు నా 600 కార్టూన్ పాత్రలు నా గోడ మీదకెక్కి నన్ను పలకరిస్తున్నాయి చూడండి.

ఇంతకన్న ఆనందం ఏమిటుంటుంది చెప్పండి!!








మన తెలుగు కార్టూనిస్టుల వైభవాన్ని
పరిచయం చేస్తున్న శీర్షిక!

25

## యస్.వి.రమణ (ARUN) (సెల్ఫీ)

**పూర్తి** పేరు సుంకర వెంకట రమణ రావు కలం పేరు **ARUN.**

పుట్టింది, పెరిగింది (25 సం॥ వయసు వరకు) విజయవాడలో. స్థిర నివాసం హైదరాబాద్‌లో (40సం॥గా) వెరసి ఇప్పుడు 65 సంవత్సరాలు వయసు....అంటే సీనియర్ సిటిజన్ అన్న మాట!

చదువు(లు) 'బి.ఏ' చేసిన తర్వాత దానికి ముందు... 'ఎమ్' కలిపితే బాగుంటుందని 'ఎంబీఏ' చేసేసాను. కేంద్ర ప్రభుత్వ రంగ సాధారణ భీమా సంస్థలో పని చేసి 2021 లో రిటైర్ అయ్యాను.

నా మొదటి కార్టూన్ ఆగష్టు 1976 అనామిక మాసపత్రికలో అచ్చయింది. అంటే (1976-2026) నా కార్టూన్ ప్రయాణానికి ఈ ఏడు స్వర్ణోత్సవం అన్నమాట! (ఉత్సవాలేమీ చేయడం లేదు లెండి) అప్పట్నుంచి సుమారు 30 వేల కార్టూన్లు అచ్చయ్యాయి. అన్ని భారతీయ భాషల్లో నా కార్టూన్లు వచ్చాయి. తెలుగులో ఎన్ని కార్టూన్లు వచ్చాయో కన్నడ పత్రికల్లో కూడా అంతే సంఖ్యలో నా కార్టూన్లు వచ్చాయి. కొన్నిసార్లు భాషా సంబంధిత విషయాల్లో తప్పులు వచ్చేవి... అయితే వారే (ఎడిటర్స్) తమ వ్యావహారిక భాషలోకి తర్జుమా చేసుకొని వేసేవారు. (ఇంతకంటే కార్టూనిస్ట్‌కి ఆనందమేముంది)

ఒకప్పటి అమెరికా నుంచి వెలువడిన తెలుగు పత్రికలు తెలుగువెలుగు, తెలుగు అమెరికాల్లో నా కార్టూన్లు చాలానే వచ్చాయి. ఇప్పుడు అమెరికా నుంచి (23 సం॥గా) వెలువడుతున్న ఏకైక తెలుగు పత్రిక తెలుగు టైమ్స్‌కి రెగ్యులర్ కాలమిస్ట్‌గా 'అమెరికార్టూన్' టైటిల్‌తో కార్టూన్లు వేస్తున్నాను.

ఇక అవార్డులు బహుమతులు - క్రోక్విల్ అకాడమీ అవార్డు , వెంకట్ అవార్డు, తానా అవార్డు మరియు సోమయాజులు అవార్డు అందుకున్నాను. (ఈ 50 ఏళ్లలో) అన్ని స్థాయిల్లో కలిపి సుమారు 100 బహుమతులు అందుకున్నాను ఇవన్నీ మన దేశంలోనే. అంతర్జాతీయంగా నా కార్టూన్లు పలు పత్రికల్లో ప్రచురణ, ప్రదర్శన కేటలాగ్‌ల్లోనూ చోటు దక్కించుకున్నాయి. విదేశీ సంస్థల నుంచి 20వరకు డిప్లొమాలు, ప్రశంసా పత్రాలు అందుకున్నాను, కానీ ఇంతవరకు ఏ ప్రైజు రాలేదు! 'సాధన చేయుమురా నరుడా సాధ్యం కానిది లేదురా!' అనుకుని ప్రయత్నం చేస్తున్నాను.


స్మైల్ స్టార్ శీర్షిక ద్వారా హాస్యానందం పాఠకులకు కార్టూనిస్టులను పరిచయం చేస్తున్నందుకు ఎడిటర్ రాము గారికి కృతజ్ఞతలు.

మిత్ర కార్టూనిస్టులకు శుభాకాంక్షలు !



















మేధావులు మేల్కొనాలి అని ప్రతి మీటింగ్ లో అనకండి ! వాళ్ళు మేల్కొంటే ఇప్పుడున్న నాయకులెవరూ ఎన్నికల్లో గెలవరు..............
పార్టీ అధ్యక్షుడు
RUN)


టోపీ మార్ట్ అన్ని రకాల టోపీలు దొరుకును
లోనికిరండి సార్! చాలా రకాలున్నాయ్ ! మీకేనా ఎవరికైనా పెట్టటానికా ...
సారీ సార్ ! ఇతను ఇదివరకు శారీ షో రూంలో చేశాడు......
(ARUN)



మొదటి నెల 30 DAYS
రెండో నెల 60 DAYS
మూడో నెల 90 DAYS
మీరే కదా ఫ్రేములన్నీ శుభ్రం చెయ్యమన్నారు ! రెండు ఫ్రేములు అటూ ఇటూ ఐనాయ్ దానికంత కోపమెందుకు సార్ !
రాపిడ్ హెయిర్ గ్రో క్లినిక్
(ARUN)


HI TECH OLD AGE HOME
ఫ్రెండువి కదాని ఇంట్లో కష్ట సుఖాలు మా ఆయన నీతో చెప్పుకుంటే ఇల్లు వదిలేసి ఇక్కడకొచ్చేయమంటావా....
MANAGER
(ARUN)


తాతా ! మన దగ్గర ఒకటే ఉందంటే ఇంకోటి పంపుతా తోడుగా ఉంటుందీ అన్నాడు బాబాయ్ ! పార్సెల్ అదే అయిఉంటుంది .......
(ARUN)


చాలా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ ఫ్రిడ్జ్ మేడం ! ఫుడ్ ఐటమ్స్ ఎప్పుడు పెట్టారు ఎప్పుడు వరకు వాడచ్చు చెప్పేస్తుంది!
సాంబారు తీసేయండి
చేపల పులుసు 4 రోజులు
2 రోజులు
నాటు కోడి పులుసు 2 రోజులు
పొరుగింటి పుల్లకూర తీసేయండి
ఉప్మా ఈ రోజే
DEMO PIECE
(ARUN)


BIOMEDICAL WASTE
BIOMEDICAL WASTE
(ARUN)


(ARUN)




## బెస్ట్ ఛీటింగ్

**ఆలశ్య తన భర్తను వద్దనుకుని తన ప్రియుడు హీరాలాల్‌తో వెళ్ళిపోదామను కుంది. కాని, అలా జరక్కుండా... ఇలా జరుగుతుందని పాపం ఆలశ్య మేడం ఊహించ లేదు.**

**ఇంతకీ ఏం జరిగిందో తెల్సుకోవాలన్న క్యూరియాసిటీ మీకు దండిగా ఉంది కదూ.. అలా ఐతే కాస్త ఓపిక చేసుకుని కొన్ని రోజులు వెనక్కి వెళ్దామా మరి?**

✦✦✦

రాయన్న హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా జాబ్ చేస్తూ పాతిక లక్షల ప్యాకేజీ తీసుకుంటూ దర్జాగా బతికేస్తున్నాడు.


అంతే కాకుండా కోకాపేట్ లో స్వంతంగా ఓ ట్రిబుల్ బెడ్ రూమ్ విల్లా, అలాగే ఓ లగ్జరీ కారుతో పాటు లక్షల్లో బ్యాంకు బాలెన్సు మైంటైన్ చేసుకుంటూ వస్తున్నాడు.

తనని పెళ్లి చేసుకున్న అమ్మాయి మహారాణిలా బతకాలనీ తన లాంటి భర్త దొరికినందుకు తన అదృష్టంగా భావించి, జన్మ జన్మలకు తననే భర్తగా కోరుకునే విధంగా ఉండాలనేది రాయన్న అభిమతం.

అందుకోసమే... తనకి రాబోయే భార్య విలాసవంతమైన జీవితాన్ని ఎంజాయ్ చేసేట్టు ముందే అన్నీ కొని పడేసి ఇప్పుడు పెళ్లి ప్రయత్నాలు షురూ చేశాడు.

ఈ కాలపు అమ్మాయిలకు రాయన్నలో బాగా నచ్చే రెండు విషయాలు వున్నాయి. మొదటిది రాయన్న పేరెంట్స్ తనతో వుండరు. వాళ్ళు ఎక్కడో పల్లెటూరిలో వుంటారు. ఇక రెండోది రాయన్నకు అక్కా చెల్లెళ్ళు కూడా లేరు.

ఇకపోతే బోనస్‌గా రాయన్నకు ఓన్ విల్లా, లగ్జరీ కారు, లక్షల్లో బ్యాంకు బ్యాలెన్సూ ఎలాగూ వుంది.




పై కారణాల వల్ల తనని పెళ్లి చేసుకోడానికి ఏ అమ్మాయి అయినా 'నో 'చెప్పదని రాయన్న కాన్ఫిడెంట్‌గా ఉండేవాడు. కానీ తమ కులంలో అమ్మాయిల షార్టేజీ వుండడంతో పరాయి కుల పోళ్ళ అమ్మాయిలైనా తను పెళ్లి చేసుకోడానికి రెడీ అని మ్యారేజీ బ్రోకర్‌తో చెప్పేశాడు.

ఇలా వుండగా చివరాకరకు ఆలశ్య అనే అమ్మాయి పెళ్లి సంబంధం లైన్లోకి వచ్చింది.

ఆలశ్య అందంగా వుంటుంది. పైగా బాగా చదువుకుంది. పెళ్లి చూపులకు వెళ్లి ఆలశ్యతో రాయన్న పది నిమిషాలు మాట్లాడాడు. ఆ కాసింత టైములోనే రాయన్నకు ఆలశ్య విపరీతంగా నచ్చేసింది.

దాంతో నిశ్చితార్థం లేకుండా డైరెక్ట్‌గా పెళ్లి డేట్ ఫిక్స్ చేసేసుకున్నారు.

ఇంకో పాతిక రోజుల్లో అందమైన ఆలశ్య తనకి భార్య కాబోతున్నందుకు రాయన్న ఎంతగా సంతోషించాడో లెక్కలేదు.

ఆలశ్య,రాయన్న ల వివాహం నిర్విఘ్నంగా జరిగిపోయింది.

ఆలశ్య, రాయన్నల అన్యోన్యత ని చూసిన చుట్టుపక్కల ఇండ్లల్లో వున్న భార్యాభర్తలు అసూయతో అలమటించి పోయేవారు.

ఈ ముచ్చట ఓ మూడు నాలుగు నెలలు కొనసాగింది.

ఆ దరిమిలా ఆలశ్యకు హీరాలాల్ అనే కన్నింగ్ ఫెలో పరిచయం అయ్యాడు.


వాడు మాయగాడు అని ఆలశ్య కు తెలీదు.


దాంతో ఇరవై నాలుగు గంటల్లో ఆ పరిచయం కాస్త ప్రేమగా కన్వర్ట్ అయిపోయింది.

ఆలశ్యకు హీరాలాల్ బిహేవియర్ ఎంతగానో నచ్చేది. తనమీద హీరాలాల్ చూపించే కన్సర్న్ కు మంచులా కరిగిపోయేది. దాంతో రాయన్న తనకి కరెక్ట్ కాదని ఫీల్ అవ్వడమే కాకుండా హీరాలాల్ తనకి డిజర్వ్ అని డిసైడ్ అయిపోయింది.

సిటీ చివర్లో వున్న దాబాలో ఆలశ్య, హీరాలాల్ చికెన్ బిర్యానీని ఆరగిస్తున్నారు.




" హీరాలాల్! మనం పెళ్లి చేసుకుందామా?" అని అడిగింది ఆలశ్య.

" మరి మీ ఆయనా?" అర్థం కాక అడిగాడు హీరాలాల్.

" మా ఆయన్ని చంపేద్దాం!" కేజువల్‌గా అంది ఆలశ్య తింటూ.

"చంపడం ఎందుకూ? మనమిద్దరం చక్కగా ముంబాయ్‌కి వెళ్ళిపోదాం! కామాటిపురాలో నాకు బెస్ట్ ఫ్రెండ్స్ వున్నారు. మనకు కావాల్సిన ఏర్పాట్లన్నీ వాళ్ళే చూసుకుంటారు. అప్పుడు అక్కడ మనం జీవితాంతం హానీమూన్ కపుల్స్‌లా గడిపేయచ్చు..." ఏకరువు పెట్టాడు హీరాలాల్ .

"అలా వద్దు! ఇక్కడే వుండీ... మా ఆయన్ని చంపేద్దాం. మన మీద అనుమానం రాకుండా నేను చూసుకుంటాను." నింపాదిగా అంది ఆలశ్య

" వద్దు ఆలశ్యా! ఈ రోజుల్లో మర్డర్ చేసి తప్పించుకోవడం దొడ్డ కష్టం. పోలీసోళ్ల కంటే ముందుగా సోషల్ మీడియాలో నెటిజన్స్ ముద్దాయి ఎవరు... ఏ ఉద్దేశంతో చంపి వుంటారు? లాంటి విషయాలన్నీ ఆధారాలతో సహా చెప్పేస్తున్నారు." అని నచ్చచెప్పే ధోరణిలో అన్నాడు హీరాలాల్.

"చేతగాని మాటలు మాట్లాడుకు హీరా లాల్! మా ఆయన బతికుంటే నేను నీతో కేర్ ఫ్రీగా ఉండలేను... అలా అని నా భర్తని వది లేసి నేను నీతో ఎక్కడికైనా వచ్చినా ఆ గిల్ట్ కాన్సస్ నన్ను మనశ్శాంతిగా ఉండనీయదు." అని ఆలశ్య అంది చికెన్ ముక్క తింటూ.

"అదికాదు ఆలశ్యా!... నవ్వే డేస్ భర్తలను చంపిన భార్యలని పోలీసులు పుసుక్కున్న పట్టే సుకుని జైల్లో తోసేస్తున్నారు... అంతెందుకూ ఈ రోజూ పేపర్ చూడు!" అని అక్కడున్న న్యూస్‌పేపర్ తీసుకుని చూపెట్టాడు.

అందులో వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నారని ఈమధ్య కాలంలో భర్తల్ని చంపిన భార్యల లిస్టు మొత్తం ఇచ్చారు. అది ఆలశ్యకు చూపెట్టే ప్రయత్నం చేశాడు హీరాలాల్.


ఆలశ్య ఆ న్యూస్ వైపు కూడా చూడకుండా అక్కడి నుండి విసురుగా లేచి వెళ్ళిపోయింది.


కారులో కూర్చోని వున్న ఆలశ్య దగ్గరకు హీరాలాల్ వచ్చి– "ఓకే ఆలశ్య! మీ ఆయన్ని చంపేద్దాం... కానీ ఎలా చంపుదామో నువ్వే ఐడియా చెప్పు!" అనునయంగా అన్నాడు హీరాలాల్.

"ఏముందీ మా అయన నిద్రపోతున్నప్పుడు నువ్వు పిల్లో మా ఆయన మొహం మీద గట్టిగా నొక్కి పట్టకో... నేను కాళ్ళు పట్టుకుంటా. అలా ఇద్దరం కల్సి మా ఆయన్ని చంపేద్దాం... తను చనిపోయాక హార్ట్‌ఎటాక్‌తో చనిపోయినట్టు నేను మహానటిలా నటించి అందర్నీ నమ్మిస్తా!" అని అంది ఆలశ్య.

"ఆలశ్యా! పోస్ట్‌మార్టంలో మీ ఆయన హార్ట్ ఎటాక్‌తో చనిపోలేదని గ్యారంటీగా తేలిపో తుంది!" హెచ్చరికగా అన్నాడు హీరాలాల్.






"పోనీ... ఎమ్టీ ఇంజెక్షన్ ఎక్కించి చంపేద్దామా?" అని అంది ఆలశ్య.

ఆలశ్య వైపు అదోలా లుక్కు ఇచ్చాడు హీరాలాల్. దాంతో తన ప్లాన్ హీరాలాల్‌కు నచ్చలేదని అర్థం చేసుకున్న ఆలశ్య– "ఇవన్నీ వద్దు గానీ, నేనే మా ఆయన తలమీద సుత్తితో కొట్టి చంపేస్తా. తర్వాత నువ్వు మా ఆయన శవాన్ని సిటీ బయటకు కారులో తీసుకెళ్ళి పాతిపెట్టు చాలు!" అంది ఆలశ్య.

"అది నావల్ల కాదు!" అన్నట్టు ఫేస్ పెట్టాడు హీరాలాల్.

ఆ హావభావాన్ని అర్థం చేసుకున్న ఆలశ్య– "సరే! ఎలా చంపుదామో నువ్వే చెప్పు!" అంది ఆలశ్య.

" నాకు తెల్సిన ఓ లారీ డ్రైవర్ వున్నాడు. మీ ఆయన ఆఫీస్‌కు వెళ్తున్నప్పుడు వాడి చేత యాక్సిడెంట్ చేయిస్తా." అన్నాడు హీరాలాల్.

"మా ఆయన ఆఫీస్‌కు కారులో వెళ్తాడు. బైక్‌లో కాదు!" అంది ఆలశ్య చీదరింపుగా.

"ఐతే నాకు తెల్సిన ఓ ఆటో డ్రైవర్ వున్నాడు. మీ ఆయన మార్నింగ్ వాకింగ్ వెళ్తున్నప్పుడు, వాడితో చెప్పి గుద్దిస్తాను.హిట్ అండ్ రన్ అనుకుంటారు. మనం సేఫ్‌గా బయటపడిపోతాం" అని హీరాలాల్ తన ప్లాన్‌ని ఎక్స్‌ప్లైన్ చేశాడు.

ఈ ప్లాన్ ఆలశ్యకు కూడా నచ్చినట్టు ఎక్స్‌ప్రెషన్ ఇచ్చి– "మరి ఆటో డ్రైవర్‌కు అమౌంట్ ఓ పది లక్షలు ఇస్తే సరిపోతుందా?..." అని అంది యధాలాపంగా.

"ఏమో అడిగి చూస్తాను! మర్డర్ గదా! పది లక్షలకు ఒప్పుకుంటాడో లేదో... నాకు డౌట్‌గా వుంది!" అన్నాడు హీరాలాల్ డల్ మొహంతో.

"అలా ఐతే పాతిక లక్షలైనా ఇద్దాం... పనైతే తొందరగా జరిగాలని చెప్పు!" అంది ఆలశ్య.

మరుసటి రోజు ఆలశ్యకు హీరాలాల్ ఫోన్ చేసి– "ఆటో డ్రైవర్ యాభై లక్షలు అడిగాడు. ముప్పై లక్షలకు బేరం ఆడాను. ఇంతకంటే తక్కువ ఐతే వాడు ఒప్పుకోవడం లేదు !" అని అదిరిపోయే అబద్ధం కూశాడు.

"సరే నో(ప్రాబ్లం!వాడు అడిగినంత ఇచ్చేద్దాం గానీ, మరి నేను డబ్బు ఎక్కడికి తీసుకు రానూ?" అని ఆత్రుతగా అడిగింది ఆలశ్య.

హీరాలాల్ వెన్యూ చెప్పాడు.

ఆలశ్య అక్కడికి డబ్బు తీసుకొచ్చి ఇచ్చి వెళ్తూ– "ఆ ఆటోడ్రైవర్‌తో 'పని' రేపే జరిగిపోవాలని మరీ మరీ చెప్పు!" అంది.

మరుసటి రోజు మార్నింగ్ వాకింగ్‌కు వెళ్ళాడు రాయన్న.

ఆలశ్య తన భర్త చావు కబురు కోసం ఆశగా ఎదురుచూడసాగింది.

వెళ్ళిన రాయన్న గంట తర్వాత సేఫ్‌గా ఇంటికి తిరిగి వచ్చేశాడు.

రాయన్న బాత్‌రూమ్ లోవుండగా...

ఆటో డ్రైవర్ యాక్సిడెంట్ ఎందుకు చేయలేదో కారణం కనుక్కుందామని హీరాలాల్‌కు ఆత్రుతగా ఫోన్ చేసింది ఆలశ్య.

లిఫ్ట్ చేయలేదు హీరాలాల్.

రాయన్న ఆఫీస్‌కు వెళ్ళాక హీరాలాల్‌కు మళ్ళీ ఫోన్ చేసింది ఆలశ్య.

ఈసారి లిఫ్ట్ చేసి– "హలో ఎవరూ?..." అని ఓ లేడీ గొంతు అడిగింది.

"హీరాలాల్‌గారు వున్నా రాండీ?" అని నమ్రతగా అడిగింది ఆలశ్య.

"నేను ఆయన భార్యనే!... విషయం ఏంటో చెప్పండి!" అని అంది.

ఈ మాట వినగానే... ఆలశ్య తన పక్కన బాంబు పడ్డట్టు అదిరి పడింది.

ఎందుకంటే హీరాలాల్ తనకి పెళ్లి కాలేదని ఆలశ్యతో అబద్ధం చెప్పాడు.

ఆలశ్య ఏమీ మాట్లాడకపోయేసరికి హీరాలాల్ భార్య– "హలో మా ఆయన నేనూ మా పిల్లలు అందరం కల్సి ప్లైజర్‌ట్రిప్‌గా బ్యాంకాగ్ వచ్చాం. వారం తర్వాత హైదరాబాద్ వస్తాం. అప్పుడు ఫోన్ చేయండి!" అని కాల్ కట్ చేసింది.

ఆ రోజు రాత్రి హీరాలాల్ కు ఆలశ్య మళ్ళీ కాల్ చేస్తే తన నెంబర్ బ్లాక్ చేసినట్టు తెల్సింది.

ఆలశ్య తను హీరాలాల్‌ని నమ్మి ఎంత దారుణంగా మోసపోయిందో ఇప్పుడు తెల్సొచ్చింది. ఆ బాధలో ఆ రోజంతా అన్నం కూడా తినకుండా ఏడ్చుకుంటూ ఉండిపోయింది.

సాయంత్రం రాయన్న ఆఫీస్ నుండి ఇంటికి వచ్చి– "ఆలశ్యా! మీ నాన్న హార్ట్ ఆపరేషన్ గురించి అపోలో హాస్పిటల్ డాక్టర్స్‌తో మాట్లాడాను. ఆపరేషన్‌కు పది లక్షలు సరిపోతుంది అన్నారు... డబ్బులు అడ్జస్ట్ అయ్యాయి... మామయ్యను రేపు బయలుదేరి వచ్చేయమని చెప్పు!" అని అన్నాడు.

"ఇలాంటి దేవుడ్నా నేను చంపించాలని చూసింది 'అని ఫీల్ అయి రాయన్న ను గట్టిగా హగ్ చేసుకుని గిల్ట్‌తో ఏడ్చేసింది ఆలశ్య.

"ఏయ్ ఆలశ్య! ఏంటిది? ఎందుకు ఏడుస్తున్నావ్?" అని అసలు విషయం తెలీని రాయన్న ఆమెను ఓదార్చాడు.

ఆలశ్యకు హీరాలాల్ చేసింది... ఇప్పుడు మోసం అని ఎంతమాత్రం అనిపించడం లేదు. వాడు అలా చేయబట్టే దేవుడిలాంటి తన భర్తని తన చేజేతులా చంపుకోకుండా కాపాడుకున్నట్టు ఫీల్ అయింది.



# చౌక బేరం!

తెలికిచెర్ల విజయలక్ష్మి-9301421243

**"ఏమైందిరా!... ఎందుకని అలా కూర్చున్నావు!" అన్నాడు కామేశం.**

**"ఇంట్లో ఖాళీగా ఉండాలంటే నాకు నచ్చడంలేదు... అందరూ ఏదో ఒకటి చేస్తూ బిజీగా ఉంటున్నారు... నాకూ ఏదైనా బిజినెస్ చెయ్యాలని ఉంది అంటూ గొడవ పెట్టింది మీ వదిన!" అన్నాడు పరాంకుశం.**


"మీ ఆవిడ ఆలోచన మంచిదేరా... నా భార్య అయితే, అర్ధరాత్రి హఠాత్తుగా లేచి మూడొచ్చిందంటూ... కాగితాలు ముందేసుకుని కూర్చుంటుంది. నాలుగు లైన్లు రాయడం, మేటర్ నా చేత టైప్ చేయించడం. నిద్రలేక కళ్ళు నొప్పెడుతున్నాయనుకో!" అన్నాడు నిట్టూరుస్తూ కామేశం.

"అలా రాశులు రాశులుగా రాశి పోసినా బాగుండును. ఏదో ఒక బాధ పడేవాడిని. రాత కోతలు నాకు అబ్బవు. నేను బిజినెస్ మాత్రమే చేస్తాను అంటూ మొండి పట్టుపట్టింది!" అన్నాడు పరాంకుశం.

"ఇద్దరూ సంపాదించడం మంచిదే... వదినమ్మను కాస్త అర్థం చేసుకో!..." అన్నాడు నవ్వుతూ కామేశం.

"సరేలే! ముందు పూర్తిగా విను... ఒక నైటీ కొంటే మరొక నైటీ ఫ్రీగా పికె బ్రదర్స్ షాపులో సేల్ పెట్టారని... ఈవిడగారికి తెలిసింది. అవన్నీ కొని వాట్సాప్ గ్రూప్ మిత్రులకు డబుల్ రేట్‌తో అమ్ముకుంటే బోలెడు లాభం వస్తుంది. అంటూ నస పెట్టింది. వాట్సాప్ గ్రూప్‌లు ఎమోజీలు పెట్టుకోవడానికే కానీ...ఇలా వ్యాపార పరంగా బాగోవు అన్నాను. నిరాహార దీక్షకు పూనుకుంది. ఇక ఒప్పుకోక తప్పలేదు."

'మా నైటీ వేసుకుంటే గరిట పట్టుకున్న అన్నపూర్ణలా, పూజ గదిలో పార్వతీ దేవిలా, పడక గదిలో రంభలా కనిపిస్తారు!' అంటూ ప్రచారం చేసింది. అవి చదివి అందరూ టెంప్ట్ అయి ఎడ్వాన్స్ ఇచ్చారు. నైటీలు తెచ్చి అందరికీ ఇచ్చింది.




ఆ నైటీలు ఒక ఉతుకు వరకూ బాగానే ఉన్నాయిట... ఏదైనా తగిలినా, కూర్చున్నా, ఎవరైనా నైటీ పట్టుకుని లాగినా సర్రున చిరుగుతున్నాయట. ఏదో ఒకరివి అయితే అలా అయిందని అనుకోవచ్చు... అందరివీ అలాగే చిరిగిపోతున్నాయిట. నైటీలు మా మోహాన కొట్టి... డబ్బులు తిరిగి ఇవ్వమని... ఇంటిమీదకు వచ్చారు అందరూ. పాతికవేల రూపాయలు అందరికీ పప్పులు పంచినట్టు పంచాను.... ఇప్పుడా నైటీలన్నీ మిషన్‌కి ఇచ్చి ఒకొక్క నైటీ ఒకొక్క డోర్‌మేట్‌గా మార్పించింది. వాటిని మన ఆఫీసుకి తీసుకు వచ్చి అమ్ముతాను అంది. అంతపని చేస్తుందనే భయంతో బజారులో ఉండే దుకాణాలకు వెళ్ళి... ఒక డోర్‌మేట్ కొంటే... మరొకటి ఫ్రీ!' అంటూ అమ్ముతూ వచ్చాను!" అంటున్న స్నేహితుడి కష్టానికి గుండె సముద్రమే అయింది కామేశానికి.





# బ్రో(దో)చేవారెవరురా!

డా.చివుకుల పద్మజ-9949979660

**అదొక యాభై ఫ్లాట్స్ ఉండే అపార్ట్మెంట్ కాంప్లెక్స్. దానికొక వాట్సాప్ గ్రూప్. రోజువారీ లావాదేవీలు, రిపేర్లు, కంప్లయింట్లు, కబుర్లూ అన్నీ అందులోనే జరుగుతూంటాయి.**

**యాభైమంది మెంబర్లు అంటే, ఇంటికి నలుగురు చొప్పున వేసుకున్నా రోజుకి కనీసం ఒకళ్ళదో, ఇద్దరిదో పుట్టినరోజు వస్తుంది. కేక్ కట్ చేసే ఫోటో పెడతారు. ఇంకేముందీ, శుభాకాంక్షల వెల్లువ.**

ఇవి కాక... పెళ్లిరోజులూ, పిల్లల స్కూలు ప్రోగ్రెస్ రిపోర్టులూ, అవార్డులూ, రివార్డులూ వెరసి ఒకరోజు వాట్సాప్ చాటింగ్‌లు చూడాలంటే ఒకరోజే టైం పడుతుంది.

అయితే ఇదంతా అందరూ చక్కగా కలిసి మెలిసి ఉండటానికి ఒక దారైతే, ఒక పెద్ద ఉపద్రవం ఆ కాంప్లెక్స్ ప్రెసిడెంట్ శేషగిరి నుంచి వచ్చింది.

ఆ మధ్య ఎక్కడో ఒక సాహిత్యసభకి వెళ్ళొచ్చినప్పటి నుండీ... అపార్ట్‌మెంట్ వాట్సాప్ గ్రూప్‌లో రోజుకొక టాపిక్ ఇచ్చి దాని మీద కథ రాయమని మొదలు పెట్టాడు.

'ఆహా! ఎంత మంచి ప్రక్రియ. ఈ ఉరుకుల పరుగుల జీవితంలో ఈ కాస్త సాహిత్యపు గాలి తగిలితే ఎంత హాయి' అని తెలుగు సాహిత్యం మీద ఇష్టం గల... కొంచెం కలం విదల్చగల ప్రకాశం లాంటి వాళ్ళు ఏ కథో, కాకరకాయో రాసి పెడుతుంటారు. ఏమీ రాయని వాళ్ళని వాట్సాప్‌లోనూ, నెలకొకసారి జరిగే అపార్ట్‌మెంట్ మీటింగ్లోనూ ఎండకడు తూంటాడు శేషగిరి. అపార్ట్‌మెంట్ బిల్డర్ బావమరిదీ, ఆ పై కాంప్లెక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కనుక నోరు నొక్కుకుని ఉంటున్నారు మిగిలిన జనాలు.

ఒకరోజు పొద్దున్నే కుక్కర్ విజిల్‌తో సమానంగా అరచిన భర్త ప్రకాశాన్ని చూసి అదిరి పడింది కామాక్షి.

"వీడి పిండం పిల్లులెత్తుకెళ్లా! చూసావుటే ఈ శేషగిరి అరాచకం... కాస్త ఏదో బాగానే ఇస్తున్నాడు డైలీ టాపిక్స్... మేము కూడా సరదాగా రాస్తున్నాం అనుకుంటే, ఇవేళ్టి టాపిక్ చూడు, ఏమిచ్చాడో... 'మెత్తటి తుఫాను' ట. రానురానూ మతి పోతోంది ఆ పెద్దమనిషికి" ఆవేశంగా అరిచి రొప్పుతున్నాడు ప్రకాశం.

'గాలి హోరాహోరుమని వీస్తోంది. టీవీలో తుఫాను అని ఘోషిస్తున్నారు. కరెంటు లేదు. మా ఆవిడ చపాతీలు చేసింది. అవి ఎప్పుడూ లేనంత మెత్తగా వున్నాయి. కాబట్టి ఈ తుఫాను మెత్తని తుఫాను' పిచ్చిపిచ్చిగా రాసేసి వాట్సాప్ పెట్టేసాడు.

"చూడు! దెబ్బకి దారికి వస్తాడు గురుడు" గర్వంగా చెప్పేడు భార్యతో.

దాదాపు అదే స్థాయి రియాక్షన్ ఇచ్చారు... చాలామంది గ్రూప్‌లో.

ఆ రెస్పాన్స్‌లు చూసి నిజంగానే ఖంగు తిన్నాడు శేషగిరి. ఇదేంటి! కథ రాస్తారని అనుకుంటే సోది రాశారు అని తిట్టుకున్నాడు. అయినా ఆగలేదు.

అజ్ఞాత ఉరుము, అజ్ఞాత మెరుపు, చిరునవ్వు కలిగిన మట్టి, శరీరంలో ఉదయం ఎదగటం, ఆశలో విరిగిన మౌనం, దాహంతో మండిన మేఘం ... తదితర టాపిక్స్‌తో తన వాట్సాప్ ప్రవాహం కొనసాగించాడు.


స్వంతగా ఆలోచించే బుర్ర లేదు కనుక... ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌తో పనిచేసే వెబ్సైట్లలో వచ్చినవి వచ్చినట్లు ఇచ్చేస్తున్నాడు.

ప్రకాశం తదితరులు ఎంత మొత్తుకున్నా వినలేదు.

ఆ తర్వాత ఒక ఆదివారపు మీటింగ్‌లో గోలగోల చేశారు ఫ్లాట్ ఓనర్లు.

"పిన్నిగారూ!... ఈ ప్రెసిడెంటు గోల ఏంటండీ వాట్సాప్‌లో! ఆయన గొడవ మధ్య మన అసలు సమస్యలు ఎటు పోతున్నాయో?... మొన్నటికి మొన్న మా పై వాళ్ళ బాత్రూం నీళ్లు మా ఇంట్లో కారుతున్నాయి, చూడండి... అని వాట్సాప్ పెడితే... ఆ పని చూడకపోగా 'కారుతున్న నీళ్లు' అని టాపిక్ ఇచ్చాడండీ... ఆ మర్నాడు..." గోడు వెళ్ల బోసుకుంది కామాక్షి.

"మాదీ ఇదే కథ..." వంత పాడింది ఆ పిన్నిగారు.






"మా కారిడార్‌లో సీసీ టీవీ పనిచేయట్లేదు, పాల పాకెట్లు పోతు న్నాయి అని మొత్తుకుంటున్నా నేను" మరొకాయన ఆవేశపడ్డాడు.

ఇక వరస పెట్టారు అందరూ...

మా ఖరీదైన చెప్పులు, బూట్లు పోయాయని..స్కూటీ, బైకుల సీట్లు చిరిగిపోతున్నాయనీ..వగైరా..వగైరా.....

"చాలా దొంగతనాలు జరుగుతున్నాయి ఈ మధ్య. ఏం చేస్తున్నారు మీరు? వాట్సాప్‌లో మీ వంకరటింకర డైలీ టాపిక్ గోల తప్ప ఇంకోటి పట్టించుకోవట్లేదు. మీరు ఇచ్చే టాపిక్స్ మీద వచ్చేది సాహిత్యం కాదు, మట్టీ మశానం" తీవ్రంగా గొడవపడ్డాడు ప్రకాశం.

లాభం లేదు... ప్రెసిడెంటుని మార్చాల్సిందే అని గట్టి తీర్మానం చేశారు అందరూ కలిసి.

ఉక్రోషంతో మింగలేక కక్కలేక అల్లాడిపోయాడు శేషగిరి.

సెల్లార్లో ఇంత రభస జరుగుతుండగా మీటింగ్‌కి రాని ఒక ఫ్లాట్ ఓనర్ అప్పుడే వాట్సాప్ పెట్టాడు.

"ఎవర్రా! టెర్రస్ మీద ఆరేసిన నా ఎర్ర రంగు కట్ డ్రాయర్ కొట్టేసిందీ?"

"ఏ పీనాసి వెధవ అయినా ఆ చిరిగిపోయిన డ్రాయరు కోసం అంత ఏడుస్తాడా?" కసిగా రిప్లై పెట్టేసి జనాల్ని తప్పించుకుంటూ తన ఫ్లాట్‌కి వెళ్ళిపోయేడు శేషగిరి.



ప్రతి నెలా ఇతర భాషలకు చెందిన ఒక భారతీయ కార్టూనిస్టుల పరిచయం

నిర్వహణ: నాగిశెట్టి




## శ్రీ మనోజ్ చోప్రా

ఈసారి మనం జమ్ము కి చెందిన మరో కార్టూనిస్ట్ శ్రీ మనోజ్ చోప్రా గురించి తెలుసుకుందాం.

వీరి తండ్రి శ్రీ డి ఎల్ చోప్రా. తల్లి శ్రీమతి రాణి దేవి చోప్రా. వీరు 24.07.1971 లో జమ్మూలో జన్మించారు.


వీరు బీ.కామ్, ఎల్.ఎల్.బీ చేశారు. అయితే కార్టూన్లపై ఉన్న మక్కువతో ప్రొఫెషనల్ కార్టూనిస్ట్‌గా తమ ప్రయాణం కొనసాగిస్తున్నారు.




శ్రీమనోజ్‌గారు మూడుదశాబ్దాలకు పైగా మీడియా వృత్తిలో ఉన్నారు. ప్రధానంగా ప్రింట్ జర్నలిజం మరియు ప్రజా సమాచార మార్పిడిలో అంతర్భాగమైన ఎడిటోరియల్ కార్టూనింగ్ ద్వారా వీరి ప్రయాణం సాగుతోంది. వీరి చిత్రాలు వార్తల విశ్లేషణ, ప్రజాభిప్రాయాన్ని రూపొందించడం మరియు దృశ్యమాధ్యమ జర్నలిజం ద్వారా ప్రజాస్వామ్య చర్చలకు నిరంతరం దోహదపడుతున్నాయి.

ఈయన 1996లో 'ది నార్త్ లైన్స్'(The Northlines) తో తన మీడియా వృత్తిని ప్రారంభించారు. ఆ తర్వాత 'స్టేట్ టైమ్స్' (State Times)తో సుదీర్ఘకాలం అనుబంధం కలిగి ఉన్నారు. 2008 నుండి జాతీయ దినపత్రిక 'పంజాబ్ కేసరి'లో ఎడిటోరియల్ కార్టూనిస్ట్‌గా పనిచేస్తున్నారు. గత 17 ఏళ్లుగా అవిచ్ఛిన్నంగా వీరి కార్టూన్లు ప్రతిరోజూ పంజాబ్ కేసరిలో ప్రచురితమవుతూ, దేశవ్యాప్తంగా లక్షలాది మంది పాఠకులకు చేరువవుతున్నాయి. గడచిన కాలంలో వీరివి 22,000కు పైగా ఎడిటోరియల్ కార్టూన్లు వార్తాపత్రికలలో ప్రచురితమయ్యాయి. సమకాలీన అంశాలు, పాలన, ఎన్నికలు, ప్రజాపరిపాలన, సామాజిక న్యాయం, మహిళా సమస్యలు, అవినీతి, జాతీయ భద్రత మరియు ప్రజాస్వామ్య సంస్థల వంటి అంశాలపై మనోజ్ చోప్రా చిత్రాలు చర్చించాయి. తద్వారా జాతీయ మరియు ప్రాంతీయ ప్రాముఖ్యత కలిగిన విషయాలపై ప్రజలకు సమాచారం అందించడంలో, వారిని చైతన్య పరచడంలో మరియు నిమగ్నం చేయడంలో నిరంతర పాత్ర పోషించాయి.

వార్తాపత్రికలలో క్రమం తప్పకుండా ప్రచురించడమే కాకుండా, భారత ఎన్నికల సంఘం (Election Commission of India) సహకారంతో చేపట్టిన ఓటర్ల అవగాహన కార్యక్రమాల



వంటి జాతీయ స్థాయి చొరవలకు కూడా వీరు తోడ్పడ్డారు.

**ప్రజా సమాచార మార్పిడిలో కార్టూన్లు ఎంత ప్రభావవంతమైన మాధ్యమంగా ఉపయోగపడతాయో అక్కడ వీరు చూపించారు.**

అంతేకాకుండా, 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్' (The Accidental Prime Minister) రాజకీయ చిత్రానికి ఎడిటోరియల్ ఇలస్ట్రేషన్లు అందించడానికి భారతదేశం నుండి ఎంపికైన ఐదుగురు కార్టూనిస్టులలో వీరు కూడా ఒకరు కావడం గొప్ప విషయం.

ఇది సమకాలీన రాజకీయ కథనంలో దృశ్య మాధ్యమం యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తుంది.

మీడియాలో శ్రీమనోజ్ చోప్రా కృషికి జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఇటీవల, మీడియా మరియు ఎడిటోరియల్ కార్టూనింగ్‌కు వీరు అందించిన జీవితకాల సేవలకు గుర్తింపుగా **'కార్టూన్ వాచ్'** (Cartoon Watch) ద్వారా **'లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డ్–2025'** అందుకున్నారు. ఈ పురస్కారాన్ని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి చేతుల మీదుగా స్వీకరించారు. వీరు భారత దేశంలో రాజకీయ కార్టూనింగ్‌కు ఇచ్చే అత్యున్నత పురస్కారం 'మాయా కామత్ మెమోరియల్ అవార్డ్' ను రెండుసార్లు అందుకున్నారు. అలాగే, భారత ప్రభుత్వం నుండి జూనియర్ ఫెలోషిప్ మరియు లలిత్ కళా స్కాలర్‌షిప్‌లను కూడా పొందారు.




**వీరు పొందిన బహుమతులలో ముఖ్యమైన వాటిలో కొన్ని:**

✦ లలిత్ కళా స్కాలర్‌షిప్, న్యూఢిల్లీ (2004–2005): ఇలస్ట్రేషన్ల (చిత్రలేఖనం) విభాగంలో, భారత్.

✦ స్టేట్ అవార్డు (మెరిట్ సర్టిఫికేట్): జమ్మూ,కాశ్మీర్ అకాడమీ ఆఫ్ ఆర్ట్, కల్చర్ అండ్ లాంగ్వేజెస్ వారు నిర్వహించిన వార్షిక కళా ప్రదర్శనలో పెయింటింగ్ విభాగంలో, భారత్.

✦ స్వర్ణ పతకం: అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (AIU) వారు 1994లో గుల్బర్గా (కర్ణాటక)లో నిర్వహించిన జాతీయ యువజనోత్సవాలలో.

✦ తృతీయ బహుమతి: UMO అంతర్జాతీయ కార్టూన్ పోటీలో, భారత్, 2006.




**'కార్టూన్ వాచ్' లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డ్–2025**

✦ ఎక్సలెన్స్ అవార్డు: 4వ LMఅంతర్జాతీయ కార్టూన్ పోటీలో, చైనా.

✦ స్పెషల్ హానర్ ప్రైజ్: 5వ తబ్రిజ్ అంతర్జాతీయ కార్టూన్ పోటీ 2006లో, ఇరాన్.

✦ ఆనరబుల్ మెన్షన్ (గౌరవప్రదమైన గుర్తింపు): కాస్టెల్లార్, కోజుచో 2007, పోలాండ్.

✦ ఫస్ట్ వెబ్ ప్రైజ్: హుమోదేవా (కతిళీళిఈజుజూజజు) 2005లో, రొమేనియా.

✦ వరల్డ్ ప్రెస్ కార్టూన్ ఎంపికలు: 2006, 2007, 2008, 2009, 2014, 2020, 2021, 2022 సంవత్సరాలలో (పోర్చుగల్).

✦ ద్వితీయ బహుమతి: హాల్ ఆఫ్ హ్యూమర్ కాంపినాస్, 1వ పోటీలో, బ్రెజిల్, 2009.

ఇవి కొన్ని మాత్రమే. ఇటువంటి ప్రతిష్ఠాత్మకమైన బహుమతులు ఎన్నో పొందారు. అలాగే వీరి కార్టూన్లు ఎన్నో ఎగ్జిబిషన్స్‌లో ప్రదర్శింపబడడమే కాకుండా, సోలో ఎగ్జిబిషన్స్ కూడా ఎన్నో నిర్వహించారు.

ఒకప్రక్క తన వృత్తికి సంబంధించిన ప్రొఫెషనల్ మరియు రాజకీయ సంబంధమైన కార్టూన్లు వేస్తూనే, ప్రజానీకానికి సంబంధించిన అనేక సమస్యలపై సోషల్ కార్టూన్లు కూడా వేస్తూ ఉండడం వీరి ప్రత్యేకత. వీరు జాతీయ అంతర్జాతీయ కార్టూన్ల పోటీలలో ఉత్సాహంగా పాల్గొనడమే కాకుండా వాటిలో ఎన్నో బహుమతులు కూడా సంపాదించడం, వీరి కార్టూన్లకున్న శక్తిని సూచిస్తుంది.

వీరి బహుమతులు పొందిన కార్టూన్లు చూస్తుంటే ఎంతో ముచ్చట వేయడమే కాకుండా చాలా స్ఫూర్తిని కూడా పొందుతాము. వీరు ఇలాగే అందరికీ ఉపయోగపడే మరియు భారతదేశానికి గుర్తింపు తెచ్చే అనేక కార్టూన్లు వేస్తూ ఉండాలని మన తెలుగు కార్టూనిస్టులందరి తరపునా కోరుకుందాము.

**Facebook Id:**
**https://www.facebook.com/ manoj.chopra.779**



# సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు

సింహాద్రి నాగ శిరీష- 9866689326

**"అబ్బా! మన వెధవకి ఈ జన్మలో పెళ్లి కాదని భయపడ్డానే అమ్మా..." కొడుకు పెళ్లిచూపుల కార్యక్రమం ముగించుకు వచ్చీ రాగానే అమ్మ గదిలో దూరి... పక్కనే కూర్చుని ఆమె చేయి తన చేతిలోకి తీసుకుని ఆనందంగా చెప్పాడు రాఘవయ్య.**

**"వాడిని పద్దాకా వెధవ అనవద్దని చెబితే మీకు అర్థంకాదా? నా కొడుక్కి పేరు లేదా?" నిష్టూరంగా అంది జానకమ్మ భర్త మాటలు వినగానే.**

**"వెధవని వెధవ అనక మరేమంటారే? నిక్షేపంలాంటి సంబంధాలు ఎన్ని తెచ్చినా అన్నింటికీ వంకలే... చూస్తూ చూస్తూనే ముడ్డికిందకి ముప్పై ఐదేళ్ళు వచ్చాయి!" అంటూ కొడుకును వెనకేసుకొస్తున్న భార్య వంక గుర్రుగా చూసాడు.**

"ఆపండర్రా మీ గోల!...ఈ సారైనా సంబంధం ఖాయమైనట్లేనా?!" ఆశగా అడిగింది ముసలమ్మ.

"ఆ భగవంతుడి దయ వలన ఖాయం ఐపోయిందే అమ్మ...!" పసిపిల్లడిలా కిలకిలా నవ్వేశాడు రాఘవయ్య.

" కానీ...ఇంత తొందరగా ఖాయం చేసుకునే ముందు, ఆ కుటుంబం ఎలాంటిదో, దాని చరిత్ర గట్రా తెలుసుకున్నారా?" అడిగింది ముసలమ్మ అనుమానంగా.

"ఏమనుకున్నావ్....'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' సినిమాలో కుటుంబమంత మంచి కుటుంబమే!" అన్నాడు రాఘవయ్య.

'అంటే?!...' అర్థంగానట్లు చూసింది ముసలమ్మ.

"అయ్యో అమ్మా!... మేము సంబంధ కోసం వీధిలో అడుగుపెట్టమో లేదో వీధిలో వారంతా మమ్మల్ని ఎంత బాగా గౌరవించారో... దగ్గరుండి మరీ అమ్మాయి ఇంటికి తీసుకెళ్లారు. కార్యక్రమం ముగిసే దాకా అంతా అక్కడే ఉన్నారనుకో... ఒక్క మాటలో చెప్పాలంటే... ఆ వీధిలో వారే కార్యక్రమం అంతా జరిపించారు!"

"అబ్బా!... ఈ కాలంలో కూడా, అదీ పట్నంలో ఇలాంటివాళ్ళు ఉన్నారా?" బుగ్గలు నొక్కుకుంది ముసలమ్మ.

ఇంత మంచి సంబంధం దొరికినందుకు అందరూ ఎంతగానో సంతోషించారు. కుళ్ళుకునేవాళ్ళు కుళ్ళుకున్నారు.

'ఓయాబ్బో వీళ్ళకే గానీ గొప్ప సంబంధం దొరికింది, ఇంత తొందరగా... మాపిల్లలు పిల్లల్ని కూడా కనేశారు' అంటూ సెటైర్లు వేశారు మరికొందరు.


ఏదేమైనా పెళ్ళిరోజు రానే వచ్చింది.

అసలా వీధిలోని వాళ్ళంతా... తమ తమ సొంత ఇంట్లో పెళ్లి అన్నంతలా పెళ్లి చేశారు. మగపెళ్ళివారికి అబ్బో ఏమన్నా మర్యాదలు చేశారా? పోటీలు పడి మరీ పనులు పురమాయించుకుని, మగపెళ్లి వారిని పుచికపుల్ల కూడా ముట్టుకోనివ్వలా. రాఘవయ్య, జానకమ్మ దంపతులకు ఆనందం అంబరాన్నంటింది.

పెళ్లి తతంగం మొత్తం పూర్తికాగానే... ఎవరి ఇళ్లకు వాళ్లు వెళ్ళిపోయారు. నోములు, వ్రతాలు అంటూఅన్ని సవ్యంగా పూర్తయ్యి, హడావిడులు నెమ్మదించాయి.

నెమ్మదిగా మొదలయ్యింది అసలు భాగవతం.

కోడలు పిల్ల నోరు తెరిచిందా, అంతా గమ్మున అయిపోవలసిందే... కిక్కురు మనేవాళ్ళు కాదు ఒక్కళ్ళూ.... ఆ సతికి జడిసి కొయ్యబారిపోయేవాళ్ళు. అదో అసంకల్పిత ప్రతీకార చర్యగా పరిణమించింది పాపం వాళ్ళకి.




దినదిన గండంగా మారిపోయింది ఆ ఇంట్లో అందరి పరిస్థితీ.

రాఘవయ్య దంపతులు చేసేది లేక, తమ గోడు వెళ్లగక్కుకునేందుకు గుళ్ళు గోపురాలు తిరగటం, తీర్థయాత్రలు చేయటం మొదలుపెట్టారు...

అలా తిరగ్గా తిరగ్గా ఓ గుళ్ళో ఓ పెద్ద మనిషి కనిపించాడు. ఎక్కడో చూసినట్టు అనిపించింది ఇద్దరికీ.

బాగా ఆలోచించగా చించగా... తమ కోడలి ఇల్లున్న వీధిలో ఉండే ఆయనేనని గుర్తొచ్చింది.

పైగా పెళ్ళికి అత్యుత్సాహం చూపించి, తెగ కష్టపడిపోయిన వాళ్ళలో ఆయన ప్రథముడు.

పట్టరాని కోపంతో ఆ దంపతులు ఆయన్ని సమీపించారు.

వాళ్లని చూడగానే చిరునవ్వుతో... "వచ్చారా! రండి!! రండి... మీ కోసమే చూస్తున్నా!" అంటూ పలకరించాడు అతను.

"అంటే మేము వస్తామని నీకు ముందే తెలుసా?!" అడిగారు ముక్త కంఠంతో.

"ఆ పిల్లని చేసుకున్నాక... ఒకటి పిచ్చాసుపత్రిలో ఐనా ఉండాలి... లేదా ఇలా తీర్థయాత్రలు అయినా చేయాలి!" చెప్పడాయన.

"అంటే... మీరంతా కలిసి కావాలనే మాకు ఈ సంబంధం అంట గట్టారా?" కోప్పడ్డాడు రాఘవయ్య.

"మీ కోపంలో న్యాయం ఉంది... కానీ ఏం చెయ్యమంటారండి! నిమిత్త మాత్రులం! వంద కుటుంబాలు బ్రతకాలంటే... ఒక కుటుంబం త్యాగం చెయ్యటమే ధర్మం. మీ పుణ్యమా అని మా వీధిలో అందరికీ బీపీలు నెమ్మదించాయి... మానసిక రుగ్మతలు ఉపశమించి, ఆరోగ్యాలు పునఃప్రాప్తించాయి. అదంతా కూడా మీ దయ.. మీరు పెట్టిన భిక్ష!" అన్నాడాయన.

" అంటే?!..."


"అంటేనా?...ఆ పిల్ల బాబోయ్... బ్రహ్మరాక్షసి! ఈపాటికి మీకు ఆ విషయం అర్థమై ఉంటుంది. వీధిలోని మేమే కాదు, ఇంట్లో వాళ్ళ అమ్మానాన్నా కూడా ఆమె నోటికి జడిసి కిమ్మనకుండా పడున్నారంటే అర్థం చేసుకోండి... ఏం చేయాలో ఏమీ పాలుపోని పరిస్థితుల్లో ..అదేదో సినిమా పుణ్యమా అని మాకు జ్ఞానబల్బు వెలిగింది. అంతే!... క్షణం ఆలస్యం చేయకుండా, ఒకే ఒక్క అబద్ధమాడి, వంద కుటుంబాల వాళ్ళం ఊపిరిపీల్చుకున్నాం!" చెప్పడాయన నింపాదిగా.

"ప్రశాంతంగా ఉన్న మా జీవితాలు నాశనం చేశారు గదయ్యా! మీకు ఇదేమన్నా న్యాయంగా ఉందా...." వస్తున్న ఏడుపు ఆపుకుంటూ అడిగారు రాఘవయ్య దంపతులు.

"అందుకే గదా!... చేసిన పాపానికి పరిహారంగా, మీ కుటుంబ క్షేమం కోరి యజ్ఞాలు, శాంతులు చేయిస్తున్నాం. అటు చూడండి. మీ పేరు మీదే ఇవాళ అన్నదానం కూడా చేస్తున్నాం. మీరూ భోంచేద్దురుగాని పదండి!" అంటూ బారులు తీరిన భక్త బందాన్ని చూపించడాయన.

చేయగలిగింది... చేసేది కూడా ఏమీ లేక... కనీసం పట్టెడు మెతుకు లైనా ప్రశాంతంగా తిందామని క్యూలో నిలబడ్డారు కృష్ణా రామా అను కుంటూ.....రాఘవయ్య, జానకమ్మ దంపతులు.







# చెల్లి మల్లి...లొల్లి!

మన్నవ నాగలలిత శ్రీదేవి-6305204796

**"అన్నయ్య..." ఫోన్లో అటువైపు చెల్లి మల్లి.**

**ఒక్కక్షణం ఆలోచించాడు ఇటువైపు ఏకాంబరం... 'మాట్లాడాలా? వద్దా?...' అని.**

**ఏకాంబరం చెల్లి మల్లి... బాబాయిగారి అమ్మాయి... ఈ మధ్య ఫోన్లో తెగ విసిగిస్తోంది.**

**చిన్నపుడు ఇద్దరూ కలిసి ఆడుకున్నారు... కలిసి చదువు కున్నారు. ఒకే స్కూలు, ఒకే ట్యూషన్, ఇద్దరూ సొంత అన్నా చెల్లెలు కన్నా ఇంకా ప్రేమగా వుంటారు.**

**మల్లి పెళ్ళయి వెళ్ళిపోయిన తర్వాత కాస్త బంధుత్వం తగ్గింది. ఇదిగో ఇప్పుడు ఇలా మళ్ళీ....**

"చెప్పమ్మా!...." అన్నాడు తప్పదనుకుని ఏకాంబరం.

"594 మార్కులు ..." అటువైపు చెల్లి మల్లి గొణిగింది.


ఏకాంబరం చెల్లి మీద కోపంతో నరాలు తెగిపోతున్నాయి...

"కాస్త విను అన్నయ్యా..." అని మల్లి అంటున్నా కూడా ఫోన్ పెట్టేసాడు.

✦✦✦

"అన్నయ్యా...."

'చెప్పమ్మా!... బావగారు పిల్లలు ఎలా వున్నారు?..." అడిగాడు ఏకాంబరం.




చాలా రోజుల తర్వాత చెల్లి మల్లి ఫోన్ చేయటంతో కాస్త ఉత్సాహంగా మాట్లాడాడు.

"అందరూ బానే వున్నారు అన్నయ్యా! అదే... వాడి పరిస్థితి ...?"

"ఎవరి పరిస్థితి?..."

"అదే అన్నయ్యా... నా కొడుకు పరిస్థితి...."

"చెప్పటానికి ఏముంది? మళ్ళీ పరీక్షకు ఫీజు కట్టడం, తిరిగి దగ్గర కూర్చోబెట్టుకుని చదివించటమే..."

"అది కాదు అన్నయ్య! నువ్వేమన్నా సాయం పడతావని...!"

"నేనా!? నేనేం చేస్తానమ్మా? నేనేమీ చేయలేను. అంత అవకాశం కాని, అన్ని అధికారాలు నా దగ్గర వుండవు. " ఖరాఖండిగా చెప్పాడు ఆమె ఉద్దేశాన్ని ముందే పసిగట్టి.

"అలా అంటావేంటి అన్నయ్యా?... నువ్వు పదోతరగతి బోర్డుకు డైరెక్టరువి కదా! అన్నీ అధికారాలు నీ చేతులోనే వుంటాయట కదా!? నువ్వు కనుసైగ చేస్తే చాలు అన్ని పనులు చిటికెలో అయిపోతాయి కదా!"

'నువ్వు అనుకునే అధికారాలు ఏమిటో నాకు తెలియదు కానీ... నాకిక్కడ కొన్ని పరిమితులు ఉంటాయి...అంతకు మించి దాటి వెళితే... నేను కూడా ఇంట్లో కూర్చోటమే!!" కాస్త కోపంగా చెప్పాడు ఏకాంబరం.

"అంత మాట ఎందుకు అన్నయ్య! నువ్వు బాగుండాలి...నువ్వు బాగుంటే... నాలాంటి వాళ్ళం బాగుంటాం!"

ఏమడుగుతుందో తెలిసినా... "మరి నువ్వు అనేదేమిటి?" అన్నాడు.

"ఏం లేదు అన్నయ్యా! మా పిల్లాడికి పదోతరగతి పరీక్షల సమయంలో టైఫాయిడ్ రావటం వల్ల పరీక్షలు సరిగ్గా రాయలేక పోయాడు. అందుకని..."

"ఊ... అందుకని...?"

"ఏం లేదు కాస్త పాస్ మార్కులు వేసి పాస్ చేస్తావనీ...!" చెల్లి అడిగిన కోరికకు ఒక్కసారిగా ఏకాంబరం ఉలిక్కి పడ్డాడు.

'మల్లి ఏం మాట్లాడుతున్నావో అర్ధం అవు తుందా?...నేనెంత నిజాయితీగా వుంటానో నీకు తెలుసుకదా!... ఇంత స్టేజికి ఎలా వచ్చానో... ఎంత కష్టపడి వచ్చానో... నీకు తెలుసుకదా!! మరి అటువంటిది... మీ వాడికి పరీక్షలు రాయకుండా, హాజరు కాకుండా మార్కులు వేసి పాస్ చేయించడమా?... 'ఏదో ఒక మార్కుతగ్గి ఫెయిలయ్యాడు, కాస్త చూడు అన్నయ్య...' అంటే... రీవాల్యుషన్ పెట్టించి ఏదో తంటాలు పడొచ్చు! ఇదేంటమ్మా... మరీనూ!'అయోమయంగా జుట్టు పీక్కుంటూ అన్నాడు ఏకాంబరం.

"ఇన్నిసార్లు ఫోన్ చేసి అడగటానికి కారణం... వాడికి సంవత్సరం వృధా అవుతుందని... పేపర్లో చూశాను, పదో తరగతి పరీక్ష పేపర్లు దిద్దటం పూర్తయిందట... మార్కులు కంప్యూటీ

కరణ చేయటం... మార్కులు లిస్టులు రెడీ చేయటం... అన్నీ నీ చేతుల్లోనే వుంటాయట కదా! అందుకని...”

“నీకు ఎలా చెప్పాలో అర్థం కావట్లేదు! నేను చాలా బిజీగా వున్నాను. అదే మార్కులు కంప్యూటీకరణ చేయటంలో బిజీగా వున్నాను... పై అధికారుల నుంచి వత్తిడి... త్వరగా ఫలితాలు ఇమ్మని! కంప్యూటర్లన్నీ రిపేరు వస్తున్నాయి...ఒకరి మార్కులు ఒకరికి పడతాయోమోనని భయ పడి చస్తున్నాను. త్వరగా ఫలితాలు ఇవ్వాలి! ఈ మధ్యలో నువ్వు ఒక దానివి! తర్వాత మాట్లాడుతాను” అంటూ ఫోన్ పెట్టేసాడు ఏకాంబరం.

✦✦✦

మళ్ళీ ఫోన్ రింగయింది.“అన్నయ్య మరి...” కంగారు పడుతూ చెల్లి మల్లి.

“ఏంటమ్మా! ఫోన్లో ఏ విషయం చెప్పవూ! మాటి మాటికి కంగారు పెట్టేస్తావు! నువ్వు అడిగింది జరగదు అని చెప్పానుగా!’ కాస్త కరుకుగా చెప్పాడు ఏకాంబరం..

“అది కాదు అన్నయ్యా... 594 మార్కులు....!!”

‘చూడమ్మా! నువ్వు ఎంత చెప్పినా ఉపయోగం లేదు... ఇటీవల పదో తరగతి పరీక్ష ఫలితాలు వచ్చాయని కూడా తెలుసు. విద్యార్థులకు మార్కులు మోమోలు ఇచ్చేశాం...ఇక సర్టిఫికెట్స్ జారీ చేయాలి!”

“అదే అన్నయ్యా నేను చెప్పబోయేది...నీదెంత మంచి మనసు అన్నయ్యా!’

“........!!?”

“పైకి కరుకుగా మాట్లాడతావు కానీ నీకు చెల్లి అంటే ఎంత ప్రేమ? మేనల్లుడు అంటే ఎంత ప్రేమ?!” అంటోంది చెల్లి అటు వైపు నుండి

“............!?”

“ఎంత నా మీద ప్రేమ లేకపోతే... ఎంత మేనల్లుడి మీద ప్రేమ లేకపోతే... 600 మార్కులకు 594 మార్కులు వేసి స్కూలు ఫస్టు వచ్చేలా చేసావంటే...నీ గురించి, నీకు చెల్లి మీద వున్న ప్రేమ గురించి మేనల్లుడి మీద వున్న ప్రేమ గురించి ఎంత చెప్పినా... తక్కువే కదా అన్నయ్యా!’

చెల్లి మల్లి మాట్లాడుతునే ఉంది....

ఇటువైపు ఏకాంబరం అప్పటికే చేతిలో నుంచి ఫోన్ వదిలేసాడు.






**ఈ నెల రచయితలు: ✦ రావూరి నరేశ్ ✦ పావని కృత్తివెంటి ✦ ఉపద్రష్ట సుబ్బలక్ష్మి**

## ఇరవైఒకటవ సీన్ – రావూరి నరేశ్

**(గత సంచిక తరువాయి)**

**పరిస్థితి ఎటువంటిదైనా దాన్ని అవకాశంగా మార్చుకొని, గొప్పగా నటించి, అందర్నీ మెప్పించడానికి ప్రయత్నం చేసి సుయోధనరావు వెంటనే "ఏ బాయ్స్! లైట్స్ ఆన్... బాబు రెడీనా? కెమెరా... ఏక్షన్!" అంటూ బోయపాటిని అనుకరిస్తూ శేషాచలం చెవిలో గట్టిగా అరిశాడు.**

**అప్పటివరకు కదలకుండా పడుకుని ఉన్న శేషాచలంలో కదలికలు మొదలయ్యాయి. మెల్లగా కళ్లు తెరిచాడు. అందరూ ఎంతో సంబరపడ్డారు.**

**తనకూ ఒక అవకాశం దొరకదా అని చూస్తున్న సంగీత దర్శకుడు భైరావి పైకి లేవడానికి ప్రయత్నిస్తున్న శేషాచలం భుజం పట్టుకొని తన సొంత ప్రయోగాలు, కొత్త ప్రయోగాలేమీ చేయకుండా "మెరుపై సాగరా! ఆ గెలుపే నీదిరా! నీ రేపటి లక్ష్యం మరువకు సోదరా! నిప్పులు చిందినా ఏ పిడుగులు ఆపినా వెనకడుగే వేయక ముందుకు సాగరా!" అని మంచి పాట అందుకుని డైరెక్టర్‌లో గొప్ప ఉత్సాహాన్ని తీసుకొచ్చాడు.**

**ఈ పాట పూర్తయ్యేలోపు శేషాచలం లేచి నడవడం మొదలుపెట్టాడు.**

అందరూ తలోపని చేసేస్తున్నారు, నేను కూడా ఏదోటి చేసేయాలని తెగ ఆత్రం పడుతున్న మన హీరో మహేష్ కూడా "రారా! జగతిని జయించుదాం!... రారా! చరితను లిఖించుదాం! రారా! భవితను సవాలు చేసే కవాతు చేద్దాం! తెగించుదాం!... రారా! నడుములు బిగించుదాం! రారా! పిడుగులు ధరించుదాం!" అంటూ మొత్తానికి సందర్భానికి తగ్గ పాట అందుకున్నాడు.

మహేష్ పాడిన ఈ పాటతో శేషాచలం నడక కాస్తా పరుగుగా మారి అప్పటికే హాస్పిటల్ నుండి బయటికి వచ్చేసాడు. ఆయన వెనకే ఎంతో ఉత్సాహంతో, ఆనందంతో కేరింతలు కొడుతూ వచ్చి, ఎగిరెగిరి గంతులు వేస్తున్న అందరితో "ఇక పోదాం పదండి! షూటింగ్ మొదలుపెడదాం!" అంటూ ముందుకు సాగాడు శేషాచలం.

**ఫ్లాష్‌బ్యాక్**

శేషాచలం పదవీ విరమణ చేశాక, వచ్చిన డబ్బులలో మిగిలిన ఓ లక్ష రూపాయతో తన చుట్టూ ఉన్న వాళ్ళని వాడుకుని ఒక చిన్న ఓటీటీ సినిమా తియ్యాలన్న ఉద్దేశంతో పరిచయస్థులను వాడుకునే క్రమంలో...

ఇదంతా నిజంగా నిజమేనా?...లేక సినిమాలో లాగా సినిమానా? అంటూ ఆశ్చర్యంగా హాస్పిటల్ పైనుంచి చూస్తున్న డాక్టర్ వైపు వెనకెనక్కి తిరిగి చూసూ..., రాజ్యం పిన్ని మరోసారి తొడకొట్టింది.

## ఇరవై రెండవ సీన్– పావని కృత్తివెంటి

హాస్పిటల్ నుండి రాజ్యం పిన్ని ఇచ్చిన ... ప్రోత్సాహంతో కేరింతలు కొడుతూ బయలుదేరిన శేష్ పటాలం అపార్టమెంట్ చేరింది.

బీపీతో హాస్పిటల్‌కి వెళ్లి ఆరోగ్యంగా తిరిగి వచ్చిన శేషాచలానికి స్వాగతం చెప్తూ... చిట్టి చెల్లెలు ఛాయాదేవి,కాలనీ డైనోసార్ చాముండేశ్వరి హారతి ఇచ్చారు. దాంతో భావోద్వేగానికిలోనైన శేషాచలం "ఈ గేటు, నా ప్లాటు, ఈ అపార్ట్మెంటూ..." (ఈ గాలి, ఈ నేల ట్యూన్) అని ఆరునొక్క రాగంలో పాడుకోబోతుండగా బాబీ, బబ్లులు గుమ్మడికాయతో దిష్టి

తీయబోయి శేషాచలం కాలి మీద పడేసారు.

శేషాచలం–"చచ్చాన్రోయ్!!" అని ఒంటి కాలితో గంతులు వేస్తుంటే వెనకే సారీ చెప్తూ బాబీ, బబ్లు కూడా ఎగరసాగారు.

జరిగినది సగం మాత్రమే విన్న రాజ్యం పిన్ని "పిచ్చి సన్నాసి! ఆనందం వస్తే అచ్చం వాళ్ళ బాబాయ్‌లాగే చేస్తాడు!" అని మురిసిపోయి మొహం మీద ఫ్లాష్ బ్యాక్ రింగులు తిప్పుకుంటోంది!

ఇంతలో కాంతం–"హేవండీ! ఇపుడేగా ఆసుపత్రి నుండీ వచ్చాము. జాగ్రత్త!" అని శేషాచలాన్ని ఆపి, తమ ఫ్లాట్‌కి తీసుకువెళ్ళింది.

శేషాచలం ఫ్లాట్‌కి చేరి అందరూ సెటిల్ కాబోతుండగా... రాజ్యం పిన్ని–"ఏమిట్రా! ఇహ ఈ పూటకి అందరూ ఇళ్ళకి ఫోండి!... మా శేష్ విశ్రాంతి తీసుకోవద్దూ!?"అని కసరడంతో పెద్దావిడని ఏమీ అనలేక టీమ్ అంతా ఇళ్ళకి మళ్ళారు.

తెల్లవారింది. శేషాచలం కొత్త ఉత్సాహంతో రాత్రికి రాత్రి 'శేష్ ప్రోడక్షన్స్' పేరుతో ఏర్పాటు చేసిన వాట్సాప్ సమూహంలో ఉదయం 9కల్లా తన ఇంట్లో సమావేశమవ్వాలి అన్న సందేశం చూసి... ఉదయం తొమ్మిదౌతూనే ఒక్కక్కరూ వచ్చేస్తుంటే సంభ్రమంగా చూసారు శేషా చలం దంపతులు. ఎప్పుడూ నిశ్శబ్దంగా, స్తబ్దుగా ఉండే ఇల్లు వీళ్లందరి రాకతో చిలుకలు వాలిన చెట్టులా కళకళలాడిపోతోంది.

జీవితమంతా పిల్లల చదువులు, ఉద్యోగబాధ్యతలతో పరుగులు పెట్టిన శేషాచలం దంపతులను, రెక్కలొచ్చి దూరదేశాలకు ఎగిరి పోయిన పిల్లల మీద బెంగ,మనసుల్ని పీడిస్తున్న ఒంటరితనం కుంగ దీస్తున్నాయి. ఇప్పుడు తమ చుట్టూ ఇంతమంది ఉండటం, వారి పలక రింపులతో గుండెలోని చెమ్మ కళ్ళలోకి చేరింది.


ఇద్దరినీ అలా చూసిన రాజ్యం పిన్ని తడిదేరిన కళ్ళతోనే ధైర్యం చెప్పింది.


ఏకనాథం, సుయోధనరావు వాళ్ళని గమనించి...
మనసులోనే దుఃఖ పడుతూ...'అంతా ఒక గూటి పక్షులమే!' అను కున్నారు.

శేషాచలం,కాంతం తెచ్చి వేసిన డైరెక్టర్ కుర్చీ ఇష్టంగా నిమిరి అందులో కూర్చుని అందరి వైపు చూసి,"మన సినిమా మళ్ళీ..." అని చెప్తున్న మాట పూర్తవ్వకుండానే...

అందుకున్న మహేశ్ "సార్! నేను హీరోగా, ప్రతిభ హీరోయిన్‌గా మిరప్పళ్ళు, వేప్పళ్ళు డ్యూయట్ మొదలెట్టేద్దామా!" అన్నాడు.

అది విన్న రమేశ్ ఓరగా ప్రతిభ వైపు చూస్తూ..."సారు! సినేమా






ఈరో లాగుంటననిసి కదా నన్నెట్టుకున్నారు... మరి నాతో షూటింగ్ మొదలెట్టేయండి!" అన్నాడు.

వెంటనే కార్పొరేటర్ గణేష్– "ఇగో డైరెక్టర్ సాబ్! గీ పోరగాళ్ళ లొల్లి ఇడిసేయి... మావో నితో పాట దీసినవ్ గానీ, విలన్ షేడ్స్ ఉన్న హీరో లెక్క జూయించే జబర్దస్త్ సీన్లు దీయలే. జల్దీ గసొంటి సీన్ల షూటింగ్ షురూ జెయ్యాలె, సమఝే!"అన్నాడు.

వెనువెంటనే ఆడవాళ్లంతా మాట్లాడేస్తూ... "మేము కూడా సినిమాలో నటించాలి కదా! ఎంతసేపు హీరో... హీరోయిన్లు... విలన్లు... ఇంతేనా!?" అని గోలగోలగా మాట్లాడేస్తుంటే రాజ్యం పిన్ని ఆవేశంగా నిలబడి–

"ఆపండి! డైరెక్టర్, నిర్మాత మీరా లేదా మా వాడా?... నిశ్శబ్దంగా ఉండండి. లేకపోతే..." అని కళ్లెర్రజేసేసరికి...

అంతా నిశ్శబ్దమై పోయారు.

రాజ్యం పిన్నిలో ఈ కోణం చూసిన శేష్‌కి ప్రొఫెషనల్ లైన్ ప్రొడ్యుసర్స్ గుర్తుకు వచ్చారు!

శేషాచలం తన స్క్రిప్ట్ ప్రకారం ముందుగా హీరోయిన్ ఇంట్లో జరిగే గెట్–టు–గెదర్, అక్కడ అందరినీ పరిచయంచేస్తూ సాగే సీన్తో మొదలుపెడతానని చెప్పేసాడు.

ఔట్‌డోర్ షూటింగ్‌కి బడ్జెట్ లేకపోవడంతో గెట్–టు–గెదర్ సీన్స్ కోసం ప్రతిభ ఇంటికి చేరింది శేష్ అండ్ కో.

ప్రతిభ ఇంట్లో డ్రాయింగ్ హాలు చాలా పెద్దది.

హాలుకు బాల్కనీ... పక్కనున్న బెడ్రూము కూడా కలిపేసి చాలా పెద్దగా చేయించింది పోచమ్మ.

అదైతే ఇంతమంది గెట్ టు గెదర్ సీన్‌కి బాగుంటుంది అని నిర్ణయించాడు శేషాచలం.

సుయోధనరావు,చి.చి(చిట్టిచెల్లెలు) ఛాయా దేవి హీరోయిన్ తల్లితండ్రులుగా అతిథులను ఆహ్వానించే సీన్ గురించి చెప్తూ, సీన్లో భాగంగా హీరో ఎంట్రీ కూడా ఉంటుందని వివరించాడు.

హీరో తల్లితండ్రులుగా శేషాచలం, కాంతం కూడా షూటింగ్‌లో పాల్గొనాలి కాబట్టి, కెమెరా మెన్ ఏకనాథానికి నటీనటులు నిలబడవలసిన మార్కింగ్స్, లైటింగ్, కెమెరా యాంగిల్స్ అన్నీ చెప్పి ఫ్రేమ్‌లోకి తాను భార్యాసమేతుడై వచ్చాడు.

ఇహ మొదలయ్యింది మద్దెల దరువు శేషాచలానికి!!


రమేష్ తాను ఇష్టపడే అమ్మాయికి అన్నగా నటించాల్సి రావడం... అందులోనూ తన శత్రువు కళ్ల ముందే ఇది జరగాల్సి రావడంతో తానేంటో నిరూపించుకుని మహేశ్ పరువు తీసేయాలని నిర్ణయించుకున్నాడు.

మహేశ్ డైలగ్ చెప్పబోతుంటే...

కెమెరాకి అడ్డురావటం, మహేశ్ కి బదులు డైలాగులు తాను చెప్పేసి అతన్ని ఇరుకున పెట్టేస్తున్నాడు.

శేషాచలం ఇటు నటన... అటు డైరెక్షన్ చేస్తూ... రమేష్‌ని బుజ్జగించే ప్రయత్నం చేస్తున్నాడు... ఇదంతా దేగచూపుతో కనిపెట్టేసిన మహేశ్ తల్లి కాలనీ డైనోసార్ చాముండేశ్వరి ఒక్కసారిగా రమేష్‌పైన తిట్లు లంకించుకుంది.

'చచ్చింది గొర్రె!' అనుకున్న రమేష్ అక్కడ నుండీ పరుగందుకోబోయి... వెనక ఎవరో పట్టుకోవడంతో బిగుసుకుపోయాడు.



## ఇరవై మూడవ సీన్–
## ఉపద్రష్ట సుబ్బలక్ష్మి

ఒక్కసారి గట్టిగా విదిలించుకున్నాడు రమేష్. ఐనా విడవకపోతే మనసులోనే తిట్టు కుంటూ వెనక్కి తిరిగి, పక్కన బాంబు పడ్డట్లుగా ఉలిక్కిపడి...

"మేడం! మీరా?" అన్నాడు రమేష్.

ఆమె శ్రీవల్లి ఉరఫ్ రాజ్యం పిన్ని.

"ఏందిరా!... ఇట్లా జారుకుంటుండావూ." అంది ఆమే.

వెంటనే జావకారిపోయిన రమేష్–


"మేడం! జర అర్జంటే!" అన్నాడు చెమటలు తుడుచుకుంటూ...

"నీ మొఖం చూస్తే అట్లా కనిపించడం లేదే. తుమ్మల్లో పొద్దుగూకినట్లుండాది గానీ, ఏందీ అసలు సంగతీ?"అంది ఆమె తాపీగా.

"మస్త్ ఆకలైతుంది మేడం! జర ఇంటికి పోయి...గిప్పడే ఉరుక్కుంటూ వస్త!"అంటూ విడిపించుకోబోయాడు వాడు.

వాడు చాలా అసంతృప్తిగా ఉన్నాడన్నది అర్థమై– "ఓర్నీ! అదా సంగతీ? మరి చెప్పవేరా పిచ్చోడా! ఎప్పుడొస్తావూ? మధ్యాహ్నం షిఫ్టుల్లో నీ పైనా... నీ చెల్లి పైనా...పాట ప్లాన్ జేసామే. మావాడు చెప్పలా నీతో!... ఏరా శేషూ..." అంటూ కన్ను కొట్టింది ఆవిడ


"ఆఁ! వాళ్ళతోనా? ఆ...ఆ..." అంటూంటే ఎడమచేత్తో ఆగమన్నట్లు అతడి వీపు మీద




గిచ్చింది రాజ్యం పిన్ని.

"అమ్మో అమ్మో! ఏమిటమ్మో... మీ ఇంట్లో నల్లులూ గట్రా ఉన్నాయా ఏంటి? కండలూడ పీకుతున్నాయి!" అంటూ గభాలున లేచాడు శేషాచలం.

"నల్లులా? గవెట్లుంటయ్?... ఇగో! ఏదో గెట్టుగదరన్నవని ఊకున్న గానీ... దినామంతా లొల్లి లొల్లి. దిమాగ్ ఖరాబైతుంది!..." అంది పోచమ్మ హడావిడిగా తిరుగుతున్న... కాలనీ డైనోసార్‌ని కోరగా చూస్తూ!




"మరి సైన్‌మా ఊకే ఔతదా?... నే హీరో తల్లి.నాఇజ్జత్ తీస్తే నే ఊకుంటనా?..." అంది చాముండేశ్వరి

"ఇదిగో! మళ్ళీ గోల గోల గోల. మావాడి హెల్తు కూడా పట్టించుకోండమ్మా కాస్త!" అని రాజ్యం పిన్ని కసరగానే...

"ఏకనాధం! కాస్సేపు కట్టెయ్ దుకాణం!" అన్నాడు వీపు రాసుకుంటూ శేషాచలం.

"పేకప్!" అనేసింది డైనోసార్.

"కాలనీలో నువ్వెంత తోపుతురుమూ ఐనా, నువ్వెట్లా పేకప్ చెప్తావు? నువ్వా మా ఆయనా డైరెక్టరు?"అంది కాంతం కోపంగా.

"అమ్మా!... ఏందే ఈ లొల్లి?! జర ఊకోవే. నీకూ దండం పెడతా! నా హీరో పోస్ట్ హుష్ కాకి జేయకే!" అన్నాడు మహేష్ తల్లితో మెల్లిగా.

"ఈరో తల్లినని జర ఖుషీలో గట్ల పేకప్ చెప్పిన! ఇక గమ్మునుంట. నువ్ ఫికర్ కాకు బిడ్డా!" అంటూ పిల్లిలా కూర్చుంది మహేష్ తల్లి.

"ఏమిటో...తనకి హెల్తు దెబ్బ తినడం కాదు గానీ... అందరూ విజృంభించేస్తున్నారు. తాను ఏదో ఒకటి చేయకపోతే... వీళ్ళు లొంగేట్లు లేరు. **(సశేషం)**



# అద్దె ఇల్లు

సి.యమున, 9550445911

**ఆగకుండా మోగుతున్న ఫోన్ కాల్‌కు అదిరిపడి లేచాడు సహకారం.**

**"ఏంట్రా... సుందూ! ఇంత పొద్దున్నే చేశావు? నిద్ర పాడు చేశావు!" ఆవలిస్తూ ఆరాగా అడిగాడు సహకారం.**

**"నేను నిద్ర లేక చస్తుంటే... నీకేం హాయిగా నిద్ర పోతున్నావు!"**

**"అరె ఏమయ్యిందిరా... దోమలు కుట్టాయా?"**

**"కుళ్ళు జోకులు వేశావంటే... వెంటనే నీ ఇంటికి వచ్చి కుళ్లబొడుస్తాను!"**

"బాబోయ్, ఎందుకురా అంత కోపం?"

"ఫ్రెండ్ కదా అని సహాయం అడిగితే... ఇలాంటి ఇంట్లోనా మమ్మల్ని దింపావు!"

"ఆ ఇంటికి ఏమయ్యింది?..." అయ్యోమయంగా అడిగాడు సహకారం.

"తెలియని నగరంలో తెలిసిన ఫ్రెండ్ అని నమ్మితే...ఇదా నువ్వు మాకేసిన శిక్షా!?"

"అదేంట్రా! నెల క్రితం ఆ ఇల్లు చూపించినప్పుడు నువ్వూ, చెల్లెమ్మా 'మంచి ఇల్లు చూపించావు' అంటూ కోరస్‌గా నన్ను పొగిడారు. ఇంతలో ఇలా ప్లేట్ ఫిరాయించావేమిటీ?"

"అప్పుడు, అసలు కథ తెలియదుగా... అందుకే మెచ్చుకున్నాము!"

"ఏమయ్యిందిరా? వేసవి ఎఫెక్ట్‌కు బోర్లు ఎండిపోయి, టాప్‌లో నీళ్ళు రావటం లేదా?..."

"నీ చెత్త ఆలోచన ఆపు! ఓ.టి. టి.ల్లో సినిమాల్లాగా! బోరులో ఊరిపోతున్న నీటిని, మా అసోసియేషన్ వాళ్ళు చుట్టు పక్కల నీళ్ళు లేని వాళ్ళకి ఫ్రీ గా సప్లై చేస్తున్నారు. చలివేంద్రం కూడా పెట్టి, అడగని వాళ్ళకి కూడా అప్పసంగా చల్లటి నీళ్ళు ఇస్తున్నారు!"

"కొంపదీసి మురుక్కాలవల మీద కప్పేసి... ఆపై ఆ అపార్ట్మెంట్స్ కట్టేసారా? కంపు భరించలేక..."

"నీ దిక్కుమాలిన ఊహలు కట్టెయ్యి!..." ఒక్క అరుపు అరిచాడు సహకారం.

"మరి ఏంట్రా సమస్య?!" నీరసంగా నిలదీశాడు సహకారం.

"ఎవరితో చెప్పుకోవాలో... ఏమని చెప్పుకోవాలో తెలియటం లేదురా! మా ఆవిడ ఏడుపులు భరించలేక..." చెపుతున్న సుందరం గొంతు గద్గదమై మాట ఆగిపోయింది.

"అయ్యో! ఎందుకురా అంత బాధ పడిపోతున్నావు?... ఆ పక్కన శ్మశానాలు ఏమన్నా చచ్చాయా? అప్పుడు చూడటం మిస్ అయ్యామా? ఇప్పుడు ఆ దృశ్యాలు చూసి చెల్లెమ్మ తట్టుకోలేకపోతోందా...?" జాలి



పడిపోయాడు సహకారం.

"అసలే తన హంగామాతో పిచ్చెక్కుతోంది.... ఇప్పుడు నీ చచ్చు ప్రశ్నలతో బి.పి. కూడా పెరుగుతోంది. నువ్వు న్యూస్‌లు ఏమీ ఫాలో అవ్వవా?" గయ్యిమన్నాడు సుందరం.

"అంటే... అంటే..." నీళ్ళు నమిలాడు సహకారం.

"పోయినోళ్లని స్వర్గానికి పంపటానికి... పది కిలో మీటర్లు నడిస్తే కానీ శ్మశానం లేదు. ఆ పని అయ్యే సరికి బ్రతికున్న మేము వైకుంఠానికి పోయేటట్లు న్నాము... కొత్తగా డెవలప్ అయిన మా ఏరియాకి ఒక శ్మశాన వాటిక తక్షణమే ఏర్పాటు చేయాలని మేము డిమాండ్ చేస్తున్నాము అని మా కాలనీ వాసులు చేసిన ధర్నా గురించి పేపర్స్‌లో వచ్చిందిగా... చూడలేదా?"

"ఓ...సారీ రా! నీ కాలనీ ఆ మూల... నా కాలనీ ఈ మూల. అందుకే చూడలేదు!"

"అదంతా పక్కన పడెయ్యి. అర్జెంట్‌గా ఇల్లు మారాలి అంతే!!"

"నీకేమన్నా పిచ్చి పట్టిందా? ఈ మహా నగరంలో నీ బడ్జెట్‌లో అంత మంచి ఇల్లు దొరకటం 'ఎడారిలో నీళ్ళు దొరకటం' అంత కష్టం తెలుసా?!"

"ఈవిడ శోకాలు కన్నా... ఏ కష్టమైనా భరించవచ్చు!"

"ఇంతకూ... ఎందుకు ఏడుస్తోందిరా?"

"మా పక్క వీధిలో శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయం ఉంది తెలుసుగా...?"

"అది తెలియని వాళ్ళు... ఈ నగరంలోనే లేరులే!"

"అదే ఈవిడ ఏడుపుకు కారణం!"


"వ్వాట్!... ఏం మాట్లాడుతున్నావు?"


"గత నెల ఉన్న మూఢాలు ముగిసి... ఆ గుడికున్న కళ్యాణమండపంలో నిత్యం పెళ్లిళ్లు జరుగుతున్నాయి. అక్కడ అప్పగింతల పాట మొదలవ్వగానే... ఇక్కడ ఈమె టాప్ డాన్స్ మొదలు పెడుతోందిరా!"


"ఆ పాటకు, చెల్లెమ్మ శోక గీతానికి లింక్ ఏంట్రా? అర్థమై చావటం లేదు!..." అయ్యోమయంతో జుట్టు పీక్కున్నాడు సహకారం.

"ఆ అప్పగింతల పాట వినగానే... నా అప్ప గింతలు గుర్తుకొచ్చి మనసు బాధతో మెలికలు తిరుగుతోందండీ...' అంటూ బోరు మంటోందిరా!" అంటూ బావురుమన్నాడు సుందరం.

# ఉచిత సలహాలు




# నెల నెలా నవ్వుల వెన్నెల





**ప్రపంచ తెలుగు కార్టూనిస్టులు** కలిసి ఏర్పరుచుకున్న వాట్సాప్ గ్రూపు సభ్యులు ప్రతి నెలా ఒక అంశం మీద హాస్యానందంలో వేసే కార్టూన్ల సమాహారం.


## ఈ నెల అంశం- డిజిటల్ అరెస్ట్

నిర్వహణ: **లాల్**


























మా ఆవిడ నా మొబైల్ దాచేసి...
నన్ను డిజిటల్ అరెస్ట్ చేసిందోయ్..!!



సందూ! నువ్వడిగితే నలభై లక్షలివ్వనన్నాడుగా మీ డాడీ! -
ఇప్పుడిచ్చాడు, నీ మీద కేసవుతుందంటే.. ఠక్కున పంపేశాడు!!
నేనే నేనే అలా
సెట్ చేశా
Sridhar


మీరు డిజిటల్ అరెస్ట్‌లో ఉన్నారు
ఛే ఊర్కో, సంకెళ్ళు లేవు, వారెంట్ లేదు ఏంలేదు, అరెస్టంటావు! -అన్నీ పట్టుకొచ్చిన నిజమైన పోలీసులకే భయపడకుండ ఉచ్చ పోయించారు మా సారు, తెల్సా?!


VICTIM
DIGITAL ARREST.
P.P.Naidu.


డిజిటల్ అరెస్ట్ అంటూ ఇతనికి ఫోన్ చేసి బెదిరిస్తున్నాడు సార్!
పోలీస్ స్టేషన్
SI
Riaz..


ఏంటి చెల్లాయిని డిజిటల్ అరెస్ట్ చేసావా... ఎలా...?
ఆవిడగారి సెల్లూ T.V రిమోటు దాచి పడేసా!!


మీ కోరిక తీరబోతోంది..ఈమధ్య సైబర్ నేరస్తులు 'డిజిటల్ అరెస్ట్' పేరుతో మీ నాన్నగార్ని ఫోన్‌లో బెదిరిస్తున్నారని, తన యావదాస్తిని, వారసులుగా మీకు పంచేస్తున్నారు....
HINDU SUCCESSION ACT
ADVOCATE


పిలిస్తే... రాడం కుదరదంటు! కావాలంటే డిజిటల్ అరెస్ట్ చేసుకోమంటున్నాడు సార్!!
Vandyasri



# పాపం! ఈ దొంగ మంచివాడే!

కె.వి.సుమలత, 9492656255

**"కాంతం! ఏంటా శబ్దం?... గది తలుపు గడియ ఎందుకు తీసావు? నాకు చలి వేస్తోంది తలుపు వెయ్యి!" కళ్ళు తెరవ కుండానే అన్నాడు పరమేశ్వరం.**

**"చలి వేస్తుందన్నారు కదా... వేడి వేడి కషాయం తీసుకు రానా?" లేచి కూర్చుంది కాంతం.**

**"అమ్మో! నాకు చలేయడం లేదు బాగానే ఉంది!" దుప్పటి ముఖం మీదకు లాక్కున్నాడు పరమేశ్వరం.**

**కాంతం లేచి లైటు వేసి... పరమేశ్వరం పక్కన కూర్చుని ఒక సెల్ఫీ తీసుకుంది.**

'కషాయానికి భయపడుతున్న శ్రీవారు' క్యాప్షన్ పెట్టి సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.

"నీ చిత్రాల పిచ్చితో చచ్చిపోతున్నానే! కాస్త ఆ దీపం తీసేస్తే నేను నిద్రపోతాను!" దుప్పటి ముసుగులో నుండి అరిచాడు పరమేశ్వరం.

"మీ తెలుగు పిచ్చితో నేను చావడం లేదూ?..." మూతి మూడు వంకర్లు తిప్పుతూ లైట్ తీసి పడుకుంది కాంతం.

మరో గంట తరువాత బీరువా దగ్గర అలికిడి అవడంతో పరమేశ్వరం కళ్ళు తెరిచాడు. బెడ్ లైట్ వెలుతురులో బీరువా తాళం తీయడానికి ప్రయత్నిస్తున్న వ్యక్తిని చూసి కెవ్వుమని అరిచాడు.

"అరవకు! అరిచావంటే పొడిచి చంపేస్తాను!.." ఆ వ్యక్తి చేతిలో కత్తి పట్టుకుని వేగంగా వచ్చి పరమేశ్వరం గొంతు మీద పెట్టాడు.

"ఇదేంటి? ఎవరు నువ్వు?" కంగారుగా అన్నాడు పరమేశ్వరం.

"నేను దొంగని! కదిలావంటే పొడిచేస్తాను!!"

"నువ్వు... నువ్వు... సాయంత్రం జనాభా లెక్కల కోసం వచ్చిన అబ్బాయివి కదూ!" కాస్త తేరుకున్నాక అన్నాడు పరమేశ్వరం.

"అవును... పగలు ఎవరింట్లో దొంగతనం చేయాలో ప్రణాళిక వేసుకుని రాత్రికి వస్తాను"

అంతలో కాంతం కళ్ళు తెరిచి, భయపడాల్సింది పోయి...

"అబ్బా! ఈ నైట్ లాంప్ వెలుతురులో కత్తి మెరుపు భలే ఉంది. ఒక్క నిమిషం.. ఇలాగే ఉండు!" అని ఫోన్ తీసి ఒక ఫోటో తీసింది.

ఆ వ్యక్తి బిత్తరపోయాడు.

"మీరేం చేస్తున్నారు?... నేను మీ ఇంట్లో దొంగతనానికి వచ్చాను!" గట్టిగా అరిచాడు దొంగ.

"ఒక్క నిమిషం! నేను నైట్ మోడ్ ఆన్ చేయడం మర్చిపోయాను, ప్లీజ్ ఇంకో ఫోటో..." అని అతని చేతికి కత్తి ఇచ్చి ఫోజులు చెప్తూ ఫోటోలు తీస్తూ... 'మావారి పైన దొంగ దాడి' సోషల్ మీడియాలోకి హడావుడిగా పోస్టు చేస్తోంది.

దొంగకు ఏం జరుగుతుందో అర్థం కాక అయోమయంగా చూస్తున్నాడు... అంతలో అతడికి వచ్చిన పని గుర్తొచ్చింది.

"ఏయ్! ఇక నీ ఫోటోలు ఆపు! నాకు టైము అయిపోతుంది, లేచి బీరువా తాళం తీస్తే బంగారం, డబ్బులు తీసుకుని నేను వెళ్ళిపోతాను. లేదంటే మీ ఇద్దరినీ పైకి పంపిస్తా!" అని గర్జించాడు.


"ఆగు బాబూ!... ముందు ఆ 'టైము' అనే మాట తీసేసి. 'సమయం' అనాలి. ఇక 'పంపిస్తా' అంటున్నావు... ఎక్కడికైనా ఊరికి పంపిస్తున్నావా? కాదు కదా! ప్రాణాలు తీస్తున్నావు కాబట్టి 'పంపించివేస్తాను' అని గౌరవప్రదంగా సమాపక క్రియను వాడు!" తీరికగా కూర్చుని అన్నాడు పరమేశ్వరం.

ఈ లోపల ఎప్పుడు వెళ్ళిందో కాంతం వంటగదిలోకి వెళ్ళి... ఒక పళ్ళెం నిండా గారెలు పెట్టుకుని వచ్చింది.

"ఎప్పుడనగా తిన్నావో బాబూ!... సాయంత్రం వేసిన కాకరకాయ గారెలు ఉన్నాయి ఓ నాలుగు తిని తీరుబడిగా దొంగతనం చేసుకో!" మెరుస్తున్న కళ్ళతో అంది కాంతం.

దొంగ తెల్లబోయి... "నేను చంపడానికి వచ్చాను, తినడానికి కాదు! నీ నగలు ఇస్తావా లేక నీ పీక కోయమంటావా?" ఆమె మీదకు కత్తి ఎత్తి పెడుతూ కోపంతో అన్నాడు.

"నగలు అంటే బహువచనం... ఆమె దగ్గర ఉన్నది ఒకే ఒక నానుతాడు. ఏకవచనం పలకాలి. నీకు వ్యాకరణం రాకపోతే కనీసం లెక్కలైనా రావాలి కదా? ఇంతకీ నీకు చూపు సరిగ్గా అనుతోందా? ఉండు, మా ఆవిడ చేసిన కరివేపాకు పొడి తెస్తాను! అది తింటే గురి తప్పు



కుండా పోడవొచ్చు!" అంటూ కిచెన్‌లోకి వెళ్ళాడు పరమేశ్వరం.

కాంతం గబుక్కున అతడి చేతిలో ఉన్న కత్తిని లాక్కుని, అదే కత్తితో గారెలను ముక్కలు చేసి దొంగ వద్దు మొర్రో అంటున్నా వినకుండా అతడి నోట్లో కుక్కింది.

ఉక్కిరిబిక్కిరి కావడంతో అతడు గారె కొరకగానే ముందు పన్ను ఊడి చేతికి వచ్చింది.

రక్తంతో కలిసిన పన్ను చూడగానే దొంగకి ఏడుపొచ్చింది.

"చూశావా బాబూ! నీ దంతము ఊడిపోయింది. నీకు కర్మ ఫలాల గురించి వివరంగా చెప్తాను. ముందు ఈ కరివేపాకు పొడి చప్పరించు, చూపుతో పాటు నోటిలో గాయం కూడా మానుతుంది" గారెల పళ్ళెంలో కారప్పొడి వేస్తూ అన్నాడు పరమేశ్వరం.

'కారప్పొడి నంచుకుని గారెలు తినబోతున్న దొంగ!' కాంతం ఏకదీక్షగా వారిద్దరినీ రకరకాల ఫోటోలు తీస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తుంది.

దొంగకి ఒక పక్క మాస్టారి పాఠాలు, ఇంకో పక్క కాంతం వంటలు, ఫోటోలు... ఏమీ అర్థం కావడం లేదు.

"నన్ను చంపనివ్వండి సార్!... లేదా మీరే నన్ను చంపేయండి!... ఈ నరకం నేను భరించలేను!" అని బావురుమన్నాడు.

అంతలో కాలింగ్ బెల్ అదే పనిగా మోగుతోంది.

"అర్ధరాత్రి వేళ ఇప్పుడెవరు వచ్చారు చెప్మా?" అంటూ వెళ్ళి తలుపు తీసాడు పరమేశ్వరం.

తలుపు బయట పోలీసు, ఇన్స్‌పెక్టర్‌లు నిలబడున్నారు.

"మీ ఇంటికి దొంగ వచ్చి కత్తితో బెదిరించాడని కాంతం గారు ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టులు పెట్టారని ఆవిడ ఫాలోయర్స్ మాకు కంప్లైంట్ చేసారు!" లోపలకు వస్తూ అన్నాడు ఇన్స్‌పెక్టర్.

"సార్! దయచేసి నన్ను జైల్లో పెట్టండి. ఈయన వ్యాకరణ పాఠాలు వినలేక, ఈవిడ గారెలు కొరకలేక నాకు పిచ్చెక్కిపోతోంది. నా పాత కత్తిని కూడా వాళ్ళే తీసేసుకున్నారు. నన్ను ఇక్కడ నుండి తీసుకెళ్లండి!" దొంగ గబుక్కున ఇన్స్‌పెక్టర్ కాళ్ళ మీద పడ్డాడు.

"ఏమిటండీ ఇది?... వీడు మీ ఇంట్లో దొంగతనం చేసాడా?" అయో మయంగా చూస్తూ అడిగాడు ఇన్స్‌పెక్టర్.

"లేదండీ! పాపం! ఆ దొంగ మంచివాడే!... నా దగ్గర సంధులు, సమాసాలు నేర్చుకోవడానికి, మా ఆవిడ చేసిన కొత్తరకం వంటలు తినడానికి వచ్చి దంతము కోల్పోయాడు!" జాలిగా చూస్తూ అన్నాడు పరమేశ్వరం.

'పోలీసు, దొంగలతో నేను-మా వారు' క్యాప్షన్‌తో సెల్ఫీలు తీసుకుంటూ యమా స్పీడుగా పోస్టుతోంది కాంతం.

"సార్! వీళ్ళ పిచ్చి చూసారా? కాసేపుంటే మనం కూడా వీళ్లలో కలిసిపోతాం!" పోలీసు చేయి పట్టుకుని వెక్కుతూ అన్నాడు దొంగ.

ఇన్స్‌పెక్టర్, పోలీసు ఒకరి ముఖాలు మరొకరు అయోమయంగా చూసుకుంటున్నారు.








కూర్పు: **పోపూరి విశ్వనాథ్, 9133197111**



## ఆధారాలు:

**అడ్డం:**

1. ఈ దేవుని రథయాత్ర ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది (7)
5. చివరినక్షత్రం (3)
6. మహారాజులకాలంలో సభలో ఉండే హాస్యగానికి తోక లేదు (4)
8. అంతర్గత సమస్యలు, విభేదాలు (5)
10. పూవు (2)
13. ఒకానొక శంగారనాయిక (6)
16. అలనాటి విలక్షణ రచయిత.... ఈ గుడిపాటివారు (2)
17. అగ్గి...అటునుంచి రాజుకుంది. (2)

**నిలువు**

1. ఆత్రేయపురపు విఖ్యాతమైన మితాయి (5)
2. ప్రపంచం (3)
3. ఆస్ట్రియా రాజధాని తలక్రిందులైంది (3)
4. రావణునితమ్ముడు పైకొచ్చాడు (5)
7. తొట్రుపాటు, గందరగోళంలాంటిది (4)
9. కత్తి (4)
11. కల్ల, వ్యర్థమైనది (2)
12. పచ్చిమిర్చితో చేసే నోరూరించే పిండివంట (2)
14. బలం, సాధారణంగా బీదలపాత్రలు ఈ లోహంతో ఉంటాయి (2)
15. బట్టలు కుట్టేటప్పుడు లోపలికి పోనిచ్చిన ఎక్కువగుడ్డ (2)

## పదానందం-32 సమాధానం

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 గీ | తాం | 2 జ | లి | | 3 లి | క | 4 ఆ |
| రం | | న | | 5 రా | గి | | ధా |
| 6 అం | ద | గ | త్తె | | 7 అం | 8 బ | రం |
| కా | | ణ | | 9 సం | | ధు | |
| | 10 త | మ | ల | పా | కు | లు | |
| 11 వ్యా | | న | | ద | | | 12 తా |
| 13 హం | 14 స | | 15 ము | న | 16 గ | వె | ట్లు |
| | 17 రే | ప | ల్లె | | ల్లా | | క |




Owned & Published by : Ramu Panda from D.No.8-215/4, Yerrabalem, Guntur Dist.
Printed at: Rainbow Print Pack, Hyderabad. Edited by.Ramu.P


Brewstark®
Clothing
Brewstark is a contemporary clothing brand offering premium shirts, jeans, trousers, and T-shirts crafted with uncompromised quality and style. Blending comfort, perfect fit, and dist inctive design, Brewstark creates versatile fashion for the passionate and ambitious
Plot # S17,
Road No.10C,
Jubilee Hills,
Hyderabad.
Brewstark
9000222411

Hasyanandam July-2026 RNI No. APTEL 08387/01/1/2003-TC


# S.K.P.V.V. DOKUPARTI UPENDRA
## ENGLISH MEDIUM HIGH SCHOOL

(Sponsored by S.K.P.V.V. Hindu High Schools' Committee)

9000529938 Jakkampudi, Vijayawada - 12.

SKPVV INSTITUTIONS
Educating the Community since 1907

**CBSE Curriculum**

## 6.5 Acres of World Class Institution @ Jakkampudi

1.5 acres for International Standards Construction
5 acres for Eco Environmental Education




## KEY HIGHLIGHTS

- Concept Based Learning
- Smart Classrooms
- Modern Visualized Labs
- Arts & Sports
- Life Skills Learning
- Caring Campus
- Qualified Teachers
- Confidence, Creativity Scope
- Strong Values
- Skill - Based Learning
- Value - Based Education
- Safe & Supportive Environment
- Continuously Improve



Shooting Area



Football Court



Box Cricket



Arts & Crafts

